# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 5 జూలై 2025 | సంపుటి: 9 | సంచిక: 188 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## శ్రీశైలంలో సర్వ దర్శనానికి ఆన్‌లైన్ టోకెన్లు



2



## నిండైన తెలుగుదనానికి ప్రతిరూపం రోశయ్య



- అప్పులు లేకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని నడిపించిన ఘనత ఆయనదే
- సంస్మరణ సభలో వక్తల ప్రశంస
- లక్డీకాపూల్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే, రేవంత్

హైదరాబాద్, జూలై 04, (మనం బ్యూరో): నిండైన తెలుగుతనానికి ప్రతిరూపం దివంగత రోశయ్య అని వక్తలు పేర్కొన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ స్వర్గీయ రోశయ్య 92వ జయంతి సందర్భంగా శుక్రవారం లక్డీకాపూల్ చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఆవిష్కరించారు. అనంతరం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు,

...మిగతా 2లో



## మోడీ, అమిత్ షా అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిండ్రు



### రాజ్యాంగం నుంచి లౌకిక పదం తొలగించేందుకు బీజేపీ కుట్ర
### తెలంగాణలో వచ్చినట్లే కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకొస్తది
### సామాజిక న్యాయ సమరభేరి సభలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



- వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధించి మళ్లీ అధికారంలోకొస్తం
- రైతు రాజ్యం ఏర్పాటు చేసినం... దీనిపై పార్లమెంట్, అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- పేదలెప్పుడూ, గొర్రెలు, బర్రెలు కాస్తూనే బతకాలా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 04, (మనం బ్యూరో): ప్రధాని మోడీ, అమిత్ షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమర భేరి సభలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని ఆపరేషన్ సిందూర్‌కు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోడీ ఎందుకు మధ్యలోనే యుద్ధాన్ని ఆపేశారని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధాని నోరు విప్పరు...గతంలో అమెరికా బెదిరించినా ఇందిరా గాంధీ భయపడలేదు. దేశం

...మిగతా 2లో

## మీలాంటోళ్లను చూసి భయపడం

### పార్టీ నేతలు గ్రూపులు కట్టొద్దు

30లోగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలె

నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి

వాడివేడిగా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

అసమ్మతి ఎమ్మెల్యేలపై పీఏసీ ఆగ్రహం

కొండా మురళి వివాదంపైనా చర్చ

2

## హనుమంతుడి స్ఫూర్తిగా ఆపరేషన్ సిందూర్

గెరిల్లా యుద్ధతంత్రంతో బ్రిటిష వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు

ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నం

అల్లూరి జయంతి సభలో ప్రసంగించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

చాలామంది సమరయోధులకు చరిత్రలో సరైన స్థానం దక్కలేదు: కిషన్ రెడ్డి



2

## నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

### అధిక షుగర్, తక్కువ సోడియం స్థాయిలు ఉన్నట్టు నిర్ధారణ

తమ పర్యవేక్షణలో ఉండాలన్న ఆసుపత్రి వైద్యులు

కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ యశోద ఆసుపత్రిలో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ప్రాథమిక పరీక్షల్లో కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్) స్థాయిలు అధికంగా, సోడియం స్థాయిలు తక్కువగా ఉన్నట్లు తేలిందని ఆ బులెటిన్‌లో పేర్కొన్నారు. చక్కెర, సోడియం స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే వరకు కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతారని డాక్టర్ ఎంవీ రావు చెప్పినట్టు ఆ బులెటిన్ తెలిపింది. కేసీఆర్ ఆరోగ్యం విషయంపై కేటీఆర్ మాట్లాడుతూ..

...మిగతా 2లో

## బీజేపీకి మహిళా అధ్యక్షురాలు?

రేసులో దక్షిణాది నేతలు.. నిర్మలా సీతారామన్, పురందేశ్వరి, వానతీ శ్రీనివాసన్



2

రోజూ రూ.1.25 లక్షల ఆదాయం

## అని చెప్తున్న ప్రచారం అబద్ధమని కేంద్రం స్పష్టీకరణ




9

## మతపరమైన అంశాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదు

## అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ



హైదరాబాద్, జూలై 4: సినీ నిర్మాత అల్లు అరవింద్ ను ఈడీ ప్రశ్నించింది. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్ లో మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్ ఈడీ విచారణను కొనసాగిస్తోంది. బ్యాంకులో అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై

...మిగతా 2లో

## ఎప్పటికైనా నేను సీఎం అయిత

కొత్త పార్టీ పెట్టేది లేదు?.. బీఆర్ఎస్ నాదే

కేటీఆర్‌తో రాజకీయంగా కొంత గ్యాప్ వచ్చింది

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు

2

## సాయం పేరుతో పౌరుల్ని చంపేస్తున్నరు





గాజాలో వికృత పరిస్థితుల గురించి వివరించిన అక్కడి కాంట్రాక్టర్

ఆహార పంపిణీ కేంద్రాలకు వెళ్తే తలలపై కాలుస్తున్నరు: బాధిత వ్యక్తి

న్యూయార్క్, జూలై 4: ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజాలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడి సామాన్యుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మరోవైపు గాజాలోకి మానవీయ సాయం చేరకుండా ఇజ్రాయెల్ కట్టడి చేసింది. ఈనేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ల మద్దతు ఉన్న దాతృత్వ సంస్థ, గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) పాలస్తీనీయులకు

...మిగతా 2లో

## విజయే మా సీఎం అభ్యర్థి



ప్రకటించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)

బీజేపీ, డీఎంకేలు మా సైద్ధాంతిక శత్రువులన్న సినీ హీరో, పార్టీ వ్యవస్థాపకుడు

చెన్నై, జూలై 4: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్న నేపథ్యంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) తమ పార్టీ సీఎం అభ్యర్థిగా వ్యవస్థాపకుడు, సినీనటుడు విజయ్‌ను ప్రకటించింది. శుక్రవారం చెన్నైలో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వచ్చే నెలలో భారీ ఎత్తున రాష్ట్ర మహాసభలు

...మిగతా 2లో

## శ్రీశైలంలో సర్వ దర్శనానికి ఆన్‌లైన్ టోకెన్లు

శ్రీశైలం, జూలై4: శ్రీశైలం ఆలయంలో 'ఉచిత స్పర్శ దర్శనం'టోకెన్ల జారీకి ఆన్లైన్ విధానం ప్రవేశ పెడుతున్నట్లు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభించిన ఉచిత స్పర్శ దర్శనానికి భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆన్లైన్ ద్వారా టోకెన్లను జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 3.45 గంటల వరకు ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందన్నారు. వచ్చేవారం నుంచి ఆన్ లైన్ లో టోకెన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

## మినిమమ్ బ్యాలెన్స్ షరతు ఎత్తేసిన 5 బ్యాంకులు

హైదరాబాద్, జూలై 4: మినిమమ్ బ్యాలెన్స్ లేని పొదుపు ఖాతాలపై బ్యాంకులు అపరాధ రుసుమును విధిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఛార్జీల నుంచి కొన్ని బ్యాంకులు మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరటనిచ్చాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు జూలై 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది.

## అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది ఈడీ. అల్లు అరవింద్‌ను బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్ గా ఉన్న



వారి స్టేట్మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

**బాధ్యత గల పౌరుడిగా హాజరయ్యా..**

విచారణ అనంతరం అల్లు అరవిద్ మాట్లాడుతూ.. '2017లో ఒక మైనర్ వాటాదారుడిగా ఉన్న ఓ ప్రాపర్టీ కొనుగోలు చేశా. దానిపై ఈడీ సమస్య ఉంది. మైనర్ వాటాదారుడు బ్యాంకు రుణం తీసుకుని చెల్లించలేదు. అకౌంట్స్ బుక్ లో నా పేరు ఉండటం వల్ల ఈడీ విచారణకు పిలిచింది. బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరై వివరణ ఇచ్చాను'అని తెలిపారు.

## బీజేపీకి మహిళా అధ్యక్షురాలు?

ఢిల్లీ, జూలై 4: పార్టీ సంస్థాగత ఎన్నికలను బీజేపీ వేగంగా కొనసాగిస్తోం ది. జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో అధ్యక్ష నియామకా లు పూర్తి కావాలి. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులు ఖరారయ్యా రు. ఈ నేపథ్యంలోనే ఈసారి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ కథనాలు వెలువడుతున్నా యి. దీనితో పాటు జాతీయ అధ్యక్ష పదవి రేసులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ భాజపా ఎంపీ పురందేశ్వరి, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్ లున్నట్టు కూడా ఆ కథనాలు తెలుపుతు న్నాయి. పార్టీలో మహిళల కు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీనితో ఈ సారి ఖాయంగా మహిళా అధ్యక్షురాలు రానున్నారని భావించాలి.

# మోడీ, అమిత్ షా అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింద్రు

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఇందిర, రాజీవ్ ప్రాణాలు అర్పించారు. బీజే పీ,ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా అని ప్రశ్నించారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం ఇస్తామని ఇందిరా గాంధీ ప్రకటించి అదే పని చేసి చూపించారన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలోనే తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందిందనీ, ఇప్పటి వరకు 42 దేశాలు తిరిగిన ప్రధాని మోడీ మణిపూర్ రాష్ట్రానికి మాత్రం వెళ్లలేదని మండిప డ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని ప్రకటించిన మోడీ ప్రభుత్వం చివరికి ఏమీ చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయకుండా మిమ్మల్ని ఎవరు ఆపారంటూ మోడీని సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ కుట్ర పన్నిందనీ, అందుకే సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని చెబు తుందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కి పైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారో చెప్పాలని ఈ సందర్భంగా ఖర్గే మోడీని ప్రశ్నించారు.

**వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధించి మళ్లీ అధికారంలోకొస్తాం : సీఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మూణ్నాళ్ల ముచ్చటే అన్నారనీ, ఆ అపోహలను పటా పంచలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో 100 సీట్లు సాధించి రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమర భేరి సభలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ మూడు రంగుల జెండా చేతబూని కల్వ కుంట్ల గడీని బద్దలు కొట్టామనీ, ప్రతీ గుండెను తడుతూ ప్రజా పాలన సాగిస్తున్నామన్నారు. ఎల్బీ స్టేడి యంలోనే ఇందిరమ్మ ప్రజా పాలనకు నాంది పలికా మన్నీ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు సాధిస్తా మనీ, దానికి ఒక్కటి తక్కువ వచ్చినా తనదే బాధ్యత అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలే రని ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని బీఆర్ఎస్



నేతలు చేసిన విమర్శలను తిప్పికొడుతూ పార్టీ నేత లంతా ఐకమత్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే జనగణనతో పాటు కులగణన ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న హామీని నిలబె ట్టుకుంటామన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన 18 నెలల్లోనే దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించామనీ, కష్టాలు, ఒడిదుడుకులు వచ్చినా అన్నింటినీ అధిగమించి ముందుకు వెళ్తున్నా మని స్పష్టం చేశారు. రైతు భరోసాలో ప్రభుత్వం విఫ లమవుతుందని కొందరు ఎదురు చూశారనీ, కానీ, వారి ఆశ నెరవేరలేదన్నారు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో పార్లమెంట్, అసెంబ్లీలో ఎక్కడైనా చర్చకు సిద్ధమే. ప్రధాని మోడీ వస్తారా లేక కేసీఆర్, కిషన్ రెడ్డి ఇలా ఎవరొచ్చినా సరేనని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మోపుతూనే బతకాలా ? మేం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 60 వేల మందికి ప్రభుత్వ ఉద్యో గాలు ఇచ్చాం. లెక్క కావాలంటే చెప్పండి, అందర్ని తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్క వేయిస్తా. 60 వేలకు ఒక్కటి తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పు కుంటా అని సవాల్ విసిరారు . అంతకు ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివ రించారు. 44 లక్షల మంది రైతులకు రూ.2,180 కోట్లతో బీమా చేశామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా రూ.12 వేలు ఇస్తున్నామనీ, ఇటీవల 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసి చరిత్ర సృష్టించామని ఈ సందర్భంగా భట్టి విక్ర మార్క వెల్లడించారు.

## మీలాంటోళ్లను చూసి భయపడం

హైదరాబాద్, జూలై 04, (మనం బ్యూరో): తెలంగాణ కాంగ్రెస్‌లో రచ్చకెక్కుతున్న విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పార్టీ నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల పార్టీకి తలనొప్పి తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న కొందరు ఎమ్మెల్యేలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడొద్దనీ, గీత దాటితే ఎంతటి వారిపైనైనా వేటు తప్పదని హెచ్చ రించారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన రాజ కీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ విస్త ృత స్థాయి సమావేశాల్లో ఖర్గే మాట్లాడుతూ ''నలుగురైదుగురు గ్రూపులు కడితే భయపడతాం అనుకుంటున్నారా? ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను నేనూ, రాహుల్ అసలు పట్టించుకోం, వాళ్ల సంగతి పార్టీ క్రమశిక్షణా కమిటీ తేలుస్తుందని'' స్పష్టం చేశారు. అందుకే పార్టీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడొద్దు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలని సున్ని తంగా హెచ్చరించారు. ఈనెల 30లోగా పార్టీ పదవు లన్నీ భర్తీ చేయాలని ఖర్గే ఆదేశించారు. పదవులు భర్తీ కాకుంటే పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. పార్టీలో పని చేసిన వారికే పదవులు ఇవ్వాలనీ, పైరవీలతో పదవులు పొందాలని అనుకునే వారిని దూరం పెట్టాలని సూచించారు. ఏఐసీసీ జన రల్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కొంత మంది నేతలు అత్యుత్సాహం ప్రద ర్శిస్తున్నారు. మన ప్రతీ మూమెంట్ ను ప్రజలు గమ నిస్తారు. అందుకే ఆచితూచి వ్యవహరించాలి. మీ వ్యవహార శైలితో పార్టీని నష్టం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేయలి. జిల్లాల వారీగా ఆశావహుల లిస్టును పీసీసీ సిద్ధం చేయాలని ఆదేశించారు.

**మంత్రులు జాబితా పంపించలేదు : సీఎం**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని పదవుల భర్తీ కోసం లిస్టులు పీసీసీ చీఫ్‌కు పంపాలని సూచించారు. నామి నేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని ఇటీవల జరిగిన పార్టీ విస్త ృత స్థాయి సమావేశంలోనే స్పష్టం చేశానీ, అయినప్పటికీ ఇప్పటి వరకూ జాబితా పంపినట్లు తనకు సమాచారం లేదని పేర్కొన్నారు.

**జడ్చర్ల ఎమ్మెల్యేపై పీసీసీ చీఫ్ ఆగ్రహం**

కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ధ్‌రెడ్డిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల అనిరుద్ధ్ రెడ్డి వ్యవహారం పార్టీకి తలనొప్పిగా మారింది. గతంలో ఓ మంత్రి ప్రతీ పనికీ ముడుపులు తీసుకుంటున్నా రంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలతో రహా స్యంగా సమావేశం నిర్వహించారని ప్రచారం జరిగింది. దీనిపై అప్పట్లోనే పార్టీ పరంగా చర్చ జరిగింది. ఇలాంటి అసమ్మతి సమావేశాలు సహించేది లేదని ఆ సమయంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హెచ్చరించారు. తాజాగా, అనిరుద్ధ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారనీ, వారిని గుర్తించి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. దీంతో శుక్రవారం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసి సోమవారం విచారణకు రావాలని ఆదేశించారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత కొండా మురళి చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదంగా మారాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలపై ఆయన తీవ్ర పదజా లంతో చేసిన విమర్శలపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీ సులు జారీ చేసింది. ఈ నోటీసులపై కొండా దంప తులు ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు, పీసీసీ క్ర మశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ అంశంపై సైతం పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో హాట్ హాట్‌గా చర్చ జరిగింది.

## నిండైన తెలుగుదనానికి ప్రతిరూపం రోశయ్య

(మొదటి పేజీ తరువాయి)

జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్వర్గీయ రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీ యమన్నారు. ఇది గొప్ప రాజకీయ నేతలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. రోశయ్య విగ్రహావిష్కరణ ద్వారా ఆయన గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించినట్లు అయిందన్నారు. బహుశా మన దేశంలో ఒక రాష్ట్ర ఆర్థిక మంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదేనని ప్రశంసించారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బడ్జెట్‌ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందె వేసిన చెయ్యి అని వ్యాఖ్యానించారు. ముగ్గురు ముఖ్య మంత్రుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఏమాత్రం లోటు లేకుండా అమలు చేయగలగడం ఆయనకే దక్కిందన్నారు. వాక్పటిమ, చతురతలో రోశ య్యతో ఇంకొకరిని పోల్చలేమనీ, కాంగ్రెస్ ప్రభు త్వంలో గవర్నర్‌గా నియమితులై, బీజేపీ ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య నిలు స్తారని కొనియాడారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ, వ్యక్తిగతంగా అందరికీ అజాత శత్రువు రోశయ్య అని శ్లాఘించారు. రోశయ్యది తెలంగాణ ప్రాంతం కాక పోయినా, ఆయన విగ్రహం నెలకొల్పి గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్క ృతి, సంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని వ్యాఖ్యానించారు. రోశయ్య అసెంబ్లీలో మాట్లాడు తుంటే స్వపక్షంతో పాటు విపక్ష సభ్యులు కూడా ఏకా గ్రతతో వినేవాళ్లనీ, యువ, నూతన శాసనసభ్యులకు రోశయ్య ప్రసంగం ఒక పుస్తకమన్నారు. రోశయ్య ప్రసంగాలను స్వయంగా వినే భాగ్యం ప్రస్తుత ఎమ్మె ల్యేలలో ఎంతో మందికి కలిగిందనీ, ఆయన నుంచి ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్న అప్పటి యువ ఎమ్మెల్యేలు ఇప్పుడు మంత్రులుగా ఇతర రాజకీ యంగా ఉన్నత పదవులను అధిరోహించారనీ, ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.

## సాయం పేరుతో పౌరుల్ని చంపేస్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

ఆహారం సరఫరా చేసే కేంద్రాలను ఏర్పాటుచేసింది. అయితే.. శరణార్థులు ఆహారం కోసం వస్తున్న సమయంలో ఆ కేంద్రాల వద్ద మహిళలు, వృద్ధులు, పిల్లలపై భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారని మాజీ సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఓ మీడియా సంస్థకు తెలిపారు. ఎవరికీ ఎటువంటి ముప్పు కలిగించని, ఆకలితో అలమటిస్తున్న పౌరులపై కాల్పులు జరపడంతో వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలను గాజా మానవతా సంస్థ(జీహెచ్ఎఫ్) ఖండించింది. ఆహార పంపిణీ కేంద్రాల వద్ద పౌరులపై ఎలాంటి కాల్పులు జరగలేదని వివరణ ఇచ్చింది. సహాయ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన కెమెరాలలో రికార్డు అయిన దృశ్యాల ప్రకారం.. అధిక ఆహారం చేజిక్కించుకోవాలన్న ఆతృతలో పలువురు పాలస్తీనియన్లు ప్రమాదకరమైన ఆయుధాలతో సిబ్బందిపై దాడికి ప్రయత్నించారని..వారిని నిలువరించడానికి ఎదురుకాల్పులు చేయాల్సి వచ్చిందని పేర్కొంది. ఈనేపథ్యంలో మరికొంతమంది చిన్నారులు, వృద్ధులు గాయాలపాలయ్యారని తెలిపింది. మరికొన్నిచోట్ల ప్రజలు ఆహారం కోసం వచ్చే మార్గంలో కాకుండా పక్కకు వెళ్తుండడంతో వారిని అదుపు చేయడానికి ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని.. అయితే ఈ ఘటనల్లో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని తెలిపింది. ఈవిషయంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టినట్లు ప్రకటించింది.

**తలలపై కాలుస్తున్నారు..**

ఇజ్రాయెల్-గాజాల మధ్య యుద్ధం కొనసాగుతుండడంతో గాజాలోని ప్రజలు ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. రోజురోజుకూ వారి ఆహార సంపాదన ప్రాణాంతకంగా మారుతోంది. గాజాకు అందుతున్న సాయమంతా జీహెచ్ఎఫ్ కు చెందిన నాలుగు పంపిణీ కేంద్రాలకు చేరుతోంది. అవి ఇజ్రాయెల్ మిలిటరీ జోన్లలో ఉన్నాయి. అతికొద్ది సాయమే కొన్ని గ్రూపులకు చేరుతుండటంతో తీవ్ర తొక్కిసలాటలు చోటుచేసుకుంటున్నాయి. జీహెచ్ఎఫ్ కేంద్రాల వద్ద ప్రజలపై దాదాపుగా రోజూ కాల్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే చాలాసార్లు ఆహారం కోసం వెళ్లిన గాజా పౌరుడు మహమ్మద్ సాఖెర్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. తమ ముగ్గురు పిల్లలకు ఆహారం కోసం సహాయక కేంద్రాలకు వెళ్తున్న ప్రతిసారీ తలల పైనే కాల్చుతున్నారని, అంతా వెనక్కి వెళ్లాలని డ్రోన్లతో ప్రకటిస్తున్నారని తెలిపారు.

## ఆయనే మా సీఎం అభ్యర్థి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని కూడా పార్టీ ప్రతిపాదించింది. తమ పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తమిళనాడు ఎన్నికల్లో వేర్పాటు వాదులతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడిన ఆయన.. విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవన్నారు. బీజేపీతో చేతులు కలపడానికి తమ పార్టీ ఏమీ డీఎంకే, అన్నాడీఎంకే కాదన్నారు. ఆ రెండిటితో తమకు పొత్తులు ఉండబోవని స్పష్టం చేసిన విజయ్.. ఆ రెండు పార్టీలను తమకు సైద్ధాంతిక శత్రువులుగా పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంగ్ల భాషపై చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరి తమైనవని పేర్కొంది. ఆయన వ్యాఖ్యలు తమిళనాడు ద్విభాషా విధానంపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించింది. తమిళనాడుపై హిందీ, సంస్క ృత భాషల్ని రుద్దడాన్ని తమ పార్టీ ఎప్పటికీ అంగీకరించబోదని పునరుద్ఘాటించారు.

## నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని.. ఆయన ఆరోగ్య సూచికలన్నీ (వైటల్స్) సాధారణంగానే ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**తండ్రిని పరామర్శించిన కవిత..**

కొంతకాలంగా తండ్రితో దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఎమ్మెల్సీ కవిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను శుక్రవారంనాడు పరామర్శించారు. బాపు ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆమె చెప్పారు.

**త్వరగా కోలుకోవాలంటూ ఒవైసీ ట్వీట్..**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## ఎప్పటికైనా నేను సీఎం అయిత



హైదరాబాద్, మనం ప్రతినిధి: రాజకీయాల్లో తన అంతిమ లక్ష్యం ముఖ్యమంత్రి కావడమేనని, పదేళ్లు పట్టినా, ఇరవై ఏళ్లు పట్టినా ఆ ఆశయాన్ని నెరవేర్చుకుంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు కీలక విషయాలు వెల్లడించారు. తాను కొత్త పార్టీ పెట్టబోనని, బీఆర్ఎస్ తన పార్టీ అని స్పష్టం చేస్తూనే, పార్టీ అంతర్గత వ్యవహారాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆసక్తిని కూడా ఆమె కనబరిచారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కవిత తీవ్రంగా స్పందించారు. తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ చుట్టూ కొందరు దయ్యాలు చేరాయని, వారిని పార్టీ నుంచి ఏరివేస్తేనే బీఆర్ఎస్‌కు మనుగడ ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు. కొందరి వల్లే పార్టీ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా తన ఓటమికి సొంత పార్టీ ఎమ్మెల్యేల సహకార లోపమే కారణమని కవిత ఆరోపించారు. కష్టకాలంలో, ముఖ్యంగా ఈడీ కేసు సమయంలో పార్టీ నుంచి తనకు తగినంత మద్దతు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, సోదరుడు కేటీఆర్‌కు మధ్య వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని, కానీ రాజకీయంగా కొంత గ్యాప్ వచ్చిందని కవిత అంగీకరించారు. తాను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉండొచ్చన్న ఆరోపణలపై మాట్లాడుతూ... కేసీఆర్ అలాంటివి చేయించరని, కింది స్థాయి అధికారులే చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తప్పక అధికారంలోకి వస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. తన సామాజిక సంస్థ 'జాగృతి'ని మళ్లీ అన్ని నియోజకవర్గాల్లో బలోపేతం చేస్తానని, దాని కార్యక్రమాలను ఉద్ధ ృతం చేస్తానని ఆమె తెలిపారు.

## హనుమంతుడి స్ఫూర్తిగా ఆపరేషన్ సిందూర్

హైదరాబాద్, జూలై 4 : హనుమాన్ స్ఫూర్తిగానే ఆపరేషన్ సిందూర్ కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి, భారత ప్రభుత్వ సాంస్క ృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. 'భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నాం' అని కేంద్ర మంత్రి అన్నారు.

**చాలామంది సమరయోధులకు చరిత్రలో సరైన స్థానం దక్కలేదు: కిషన్ రెడ్డి**



గిరిజన ప్రాంతాల్లో జన్మించిన అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులకు చరిత్ర పుటల్లో సరైన స్థానం దక్కలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆ చరిత్రను సమాజానికి అందించాలనేదే ప్రధాని మోడీ ఉద్దేశమని చెప్పారు. దీనిలో భాగంగానే అల్లూరి సీతారామరాజు చరిత్ర అందరికీ తెలిసేలా 125వ జయంతిని నిర్వహించినట్లు వివరించారు. అల్లూరి నడయాడిన ప్రదేశాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్క ృతిక, పర్యటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, క్షత్రియ సేవాసమితి అధ్యక్షులు సత్యనారాయణరాజు, కార్యదర్శి కె.రఘురామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదు?

- ఆ 13 పార్టీలకు ఈసీ షో కాజ్

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేండ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది. రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి చర్యలు ప్రారంభించింది. సంబంధిత పార్టీలకు నోటీసులు అందించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించింది. అయితే, ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈసీ నుంచి నోటీసులు అందుకున్న పార్టీలివే.. 1. తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (హన్మకొండ), 2. ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్), 3. జాగో పార్టీ (హైదరాబాద్), 4. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్), 5. తెలంగాణ లోక్ సత్తా పార్టీ (హైదరాబాద్), 6. తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్), 7. యువ పార్టీ (హైదరాబాద్), 8. బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్-పూలే) (మేడ్చల్ మల్కాజిగిరి), 9. తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ (మేడ్చల్ మల్కాజిగిరి), 10. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి), 11. జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి), 12. యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి), 13. తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) (వరంగల్) పార్టీలు ఈసీ నుంచి నోటీసులు అందుకున్న జాబితాలో ఉన్నాయి.

## ఖర్గేవి పచ్చి అబద్ధాలు

### తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎస్.మధుసూదనా చారి

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో అద్భుతమైన పాలన జరిగిందని ఎల్‌బి స్టేడియం సాక్షిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పచ్చి అబద్దాలు మాట్లాడారని.. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనా చారి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు పల్లే రవికుమార్ గౌడ్, అంజనేయులు గౌడ్, ఉపేందర చారీ, రామచంద్రు నాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియాతో చారీ మాట్లాడుతూ... ఖర్గేతో చిలక పలుకులు పలికించారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు.

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నరు

- **పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి**
- **బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మన్నే కృష్ణాంక్**



**రామచంద్రపురం, జూలై 4 (మనం న్యూస్) :** ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మన్నె కృష్ణాంక్ అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తే బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తున్నారని వారు చెప్పారు. గత నెల 30న సోషల్ మీడియా వారియర్ నల్ల బాలు (శశిధర్ గౌడ్) ప్రభుత్వంపై ట్విట్టర్ ద్వారా అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకే పోలీసులు ఆయనను అరెస్టు చేసి కరీంనగర్ సెంట్రల్ జైలుకు తరలించారని ఆరోపించారు. శుక్రవారం శశిధర్ గౌడ్ను తీసుకొచ్చి ఇంద్రేశం గ్రామంలోని ఆయన నివాసంలో ఏసిపి నరసింహ రెడ్డి నేతృత్వంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ దర్యాప్తులో తన కుటుంబ సభ్యుల ఫోన్లను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను ఆదర్శ్ రెడ్డి, కృష్ణాంక్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ - 'ట్విట్టర్లో లైక్ చేస్తే కేసు, రీట్వీట్ చేస్తే జైలు' అనే పరిస్థితిని ఇప్పుడు తెలంగాణలో కొనసాగుతోందన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని అన్నారు. అణచివేయడానికి పాలకులు ఎంచుకున్న నిబంధనలు, బెదిరింపులు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం కొనసాగుతదని స్పష్టం వారు చేశారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజల తరఫున, ప్రజల హక్కుల కోసం ఈ దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటాం అని శశిధర్ గౌడ్ అన్నారు.

# ఆర్కె పురం లో అల్లూరి సీతారామరాజు జయంతి



**రంగారెడ్డి జూలై 4 (మనం న్యూస్) :** మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి ని పురస్కరించుకొని ఆర్కే పురం డివిజన్ చిత్ర లే అవుట్ పార్క్ లో బుద్ద వనం నందు చిత్ర లే అవుట్ వాకర్స్ వారిచే సీతా రాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ. కార్యక్రమలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలూ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వైస్ ఛైర్మెన్ విజయ్ కుమార్‌ను పదవి నుండి తొలగించాల్సిందే

- **టీ ఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ**



**రంగారెడ్డి, జూలై 4 (మనం న్యూస్) :** మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ పై వైస్ ఛైర్మెన్ విజయ్ కుమార్ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే పదవి నుండి తొలగించాలని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ అన్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సంచాలకులు సురేంద్ర మోహన్ లకి టీఎన్జీవో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రం ఆధ్వర్యంలో మంత్రికి, సంచాలకులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వముకు, ప్రజలకు వారధిగా అధికారులు ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే అధికారులపై ఇలాంటి దాడులు చేయడం సరైన విధానం కాదని అన్నారు. వెంటనే వైస్ చైర్మన్ ని పదవి నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో

కోశాధికారి సత్యనారాయణ గౌడ్ , ఏఎంసి సెంట్రల్ ఫోరమ్ సహా అధ్యక్షులు వెంకటేశం, సెంట్రల్ యూనియన్ కార్యదర్శి సంతోష్ ,సెంట్రల్ ఫోరమ్ బాధ్యులు అశోక్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, విజయ్ కిషోర్, రేవంత్, శ్రీకాంత్, రవి కుమార్, హైదరాబాద్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ఖలీద్ ,నగర అధ్యక్షులు శ్రీకాంత్ , హైదరాబాద్ కార్యదర్శి కురాడి శ్రీనివాస్ , రాజ్ కుమార్ ,రహీం , సుధాకర్, శంకర్ ,అమరేందర్, మహేష్,మురళి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే దేశం అభివృద్ధి

- **టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి**



**రంగారెడ్డి జూలై 4 (మనం న్యూస్) :** కాంగ్రెస్ పాలనలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని టిపిసిసి సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం

ఎల్బీ స్టేడియంలో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి కాంగ్రేస్ పార్టీ జాతీయ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ , రామకృష్ణ పురం డివిజన్ ల నుండి కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లే కార్యక్రమం కు భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. రైతుల రుణమాఫీని దాదాపు 20వేల కోట్లు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు,కిల్లమైసమ్మ చైర్మన్ సురేష్, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ రమేష్,ధనరాజ్ గౌడ్, మహేందర్,యాదవ రెడ్డి, లింగస్వామి,పగడాల ఎల్లన్న, గుల్షన్, జ్ఞానేశ్వర్ యాదవ్,శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్ యాదవ్, వక్క లంక శ్రీనివాసరావు, రేణుక,మాధవి మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం



- **ఉప్పల శ్రీనివాస్ గుప్తా**

**రంగారెడ్డి జూలై 4 ( మనం న్యూస్) :** మాజీ గవర్నర్, ముఖ్యమంత్రిగా డాక్టర్ కొణిజేటి రోశయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,మంత్రులు శ్రీధర్ బాబు , జూపల్లి కృష్ణారావు లతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశ్య భీష్మ దివంగత రోశయ్య జన్మదిన వేడుకల్ని అధికారికంగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.రోశయ్య నివసించే ప్రాంతంలో ధరం కరం₹రోడ్డు లోని వీధికి ఆయన పేరును ఖరారు చేయడం, కాంస్య విగ్రహాన్ని లకిడికపూల్, ఖైరతాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేయడం, రవీంద్రభారతిలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి పరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గ రపు దయానంద్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత , కొలేటి దామోదర్ గుప్త , రోశయ్య కుమారుడు శివ సుబ్బ రావు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటతొలి అమరుడు దొడ్డి కొమరయ్య

- **చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షులు అనంతరెడ్డి**



**చేవెళ్ల, జులై 4(మనం న్యూస్) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షులు అనంతరెడ్డి రెడ్డి, భాజపా యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డిలు అన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా చేవెళ్లలోని ఆయన విగ్రహానికి స్థానిక భాజపా నాయకులు, కురుమ సంఘం సభ్యులతో కలసి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. నేటి సమాజానికి దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు కసిరె వెంకటేష్, భాజపా నాయకులు , కార్యకర్తలు కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ జిల్లా కోఆర్డినేటర్‌గా జానయ్య

- **నియామకపత్రాన్ని అందజేసిన ఫోరం రాష్ట్ర చైర్మన్ టి. చిరంజీవులు**



**నల్గొండ, జులై 4 (మనం న్యూస్) :** బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నల్లగొండ జిల్లా కమిటీని నియమిస్తూ ఫోరం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు నియామకపత్రాన్ని విడుదల చేశారు. కమిటీలో జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ గా నేలపట్ల చంద్రశేఖర్ ను, కోఆర్డినేటర్లుగా తొమ్మిది మందిని నియమిస్తూ ఆయన నియామకపత్రాలను అందజేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ గా నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన గుండెబోయిన జానయ్య యాదవ్ ను నియమిస్తూ బి సి ఐ ఎఫ్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు నియామక పత్రాన్ని అందజేశారు. గుండెబోయిన జానయ్య యాదవ్ నల్లగొండ జిల్లా కేంద్రంలో పలువిద్యాసంస్థలను నిర్వహిస్తూ విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ గా నియామకమైన గుండెబోయిన జానయ్య యాదవ్ మాట్లాడుతూ తనపైన నమ్మకంతో తనకు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా కోఆర్డినేటర్ గా నియమించినందుకు బీసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, రాజ్యాధికారం నినాదాలుగా స్థాపించిన బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం లో పనిచేసే అవకాశం కల్పించినందుకు ఫోరం రాష్ట్ర చైర్మన్ టి.చిరంజీవులు కు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం లక్ష్యాలను సాధించేందుకు జిల్లా కమిటీతో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ గా నియమితులైన జానయ్య యాదవ్ కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రేడ్ లైసెన్సులు పరిశుద్ధ పనుల నిర్వహణ వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం

- **మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి**



**తుర్కయంజాల్, జులై 4( మనం న్యూస్) :** తుర్కయాంజల్ పురపాలక పరిధి రాగన్నగూడ వార్డ్ ఆఫీసులో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, మరియు రేషన్ కార్డుల విచారణ వంటి ముఖ్య అంశాలపై వివరణ చేశారు. సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులుగా ఎంపికైన వారు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకునేలా వార్డ్ అధికారులు దృష్టి పెట్టాలని, ఇంకా అర్హులైన లబ్ధిదారులు, ఎవరైనా మిగిలి ఉంటే వారి వివరాలను వెంటనే కార్యాలయనికి సేకరించాలని తెలియజేశారు. రేషన్ కార్డుల విచారణ, ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా భువన్ సర్వే ట్రేడ్ లైసెన్సుల పున పరిశీలన, మరియు పారిశుద్ధ్య పనుల నిర్వహణ ను ప్రాధాన్యతతో తీసుకొని, సమయానుసారంగా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో,డీఈ బిక్షపతి, శానిటేషన్ ఇనిస్పెక్టర్ వినయ్, శ్రీనివాస్ వార్డ్ అధికారులు , పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే బిగించాలని కోరుతూ చిట్యాలలో ధర్నా

**చిట్యాల, జులై 04 (మనం న్యూస్) :** చిట్యాల పదో వార్డులో మంజూరైన 100 కెవిఏ ట్రాన్స్ఫార్మర్ను ఎల్లమ్మ గుడి దగ్గర వెంటనే బిగించాలని కోరుతూ విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం చిట్యాల లో భారతీయ జనతా పార్టీ చిట్యాల పట్టణ శాఖ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్ పాల్గొని మాట్లాడుతూ చిట్యాల పదో వార్డులో గత కొద్ది సంవత్సరాల నుండి గతంలో ఉన్న 60 కెవిఏ ట్రాన్స్ఫారంపై అధికలోడు పడి లో వోల్టేజ్ ఏర్పడి ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిడ్జి లు,టీవీలు, ఏసీలు, మోటర్లు, తిరగక తరచు కాలిపోతూ ఆ వార్డు ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.



గతంలో ' లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి వివిధ రకాలుగా తీసుకుపోయిన సందర్భంలో మరో 100 కెవిఏ ట్రాన్స్ఫారం మంజూరు చేయడం జరిగింది అని అన్నారు.

ఇప్పటికీ నెలలు గడుస్తున్నా దాన్ని బిగించకపోవడం వల్ల ఎండాకాలం మొత్తం పూర్తిగా తీవ్రంగా లో వోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ మోటార్లు, ఫ్యాన్లు, మోటర్లు తిరగక తరచు తగలబడి పోతున్నాయి. తక్షణమే సంబంధిత అధికారులు మంజూరైన 100 కేవీఏ ట్రాన్స్ఫార్మర్ ను పదో వార్డులో ఉన్న ఎల్లమ్మ గుడి దగ్గర బిగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఏఈ రవీందర్ రెడ్డి తో ఫోన్లో మాట్లాడడం జరిగింది. తప్పకుండా మీ వార్డులో మంజూరైన 100 కెవిఏ ట్రాన్స్ఫార్మర్ను రెండు మూడు రోజుల్లో బిగింప చేపిస్తానని హామీ ఇచ్చాడు. అందుకు ఏఈ రవీందర్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో కన్నెబోయిన మహలింగం యాదవ్, గంజి గోవర్ధన్, జయారపు రామకృష్ణ ,కంచర్ల శంకర్ రెడ్డి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సుంచు శ్రీను, పాలకూరి వెంకటేశం, ఎస్కే లతీఫ్, గాదె శ్రీహరి, కట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య



**తుర్కయంజాల్, జులై 4 (మనం న్యూస్) :** బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీకమిటీ ఉపాధ్యక్షులు లపంగి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం తుర్కయాంజాల్ అంబేద్కర్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో అద్యక్షులు పట్నం రమేష్ కురుమ ముఖ్య అతిథి గా పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి అనంతరం వారు మాట్లాడుతూ, గడీల పాలనపై గర్జించి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన బహుజన వీరుడు, తెలంగాణ పోరాటంలో తొలి సమిధ, నిజాం పై అలుపెరగని పోరాటం చేసిన వీర యోధుడు దొడ్డి కొమురయ్య అని కొమురయ్యని ఆదర్శంగా తీసుకొని బహుజన రాజ్యాధికారం వైపు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, మాజీ కార్యదర్శి జంతుక సైదులు, కోహెడ సెక్టార్ అద్యక్షులు శీలం అంగద్ కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల యోగ క్షేమాలే ముఖ్యం

కంపెనీ లేదా పరిశ్రమ లేదా పని ప్రదేశంలో పని సంస్కృతి (వర్క్ కల్చర్), సానుకూ వాతావరణాలు, ఉద్యోగుల నియామకాలు, కంపెనీ అభివృద్ధి, ఉద్యోగుల నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగుల యోగక్షేమాలు, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణాన్ని కల్పించడం, జట్టు స్ఫూర్తిని రగల్చడం లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తున్నారు మానవ వనరుల విభాగాలు లేదా హూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్) విభాగ నిపుణులు. హెచ్ఆర్ నిపుణులు కాలానుగుణంగా మారుతూ, నిన్నటి సాంప్రదాయ విధులకు తోడుగా నేటి డిజిటల్ ఏఐ యుగపు టెక్నాలజీలను కూడా ఆకళింపు చేసుకుంటూ తమ విధులను, తమ పరిమితులను విస్తరించుకుంటూ, పునర్నిర్వచించుకుంటూ, టెక్నాలజీని ఆలింగనం చేసుకుంటూ, ఏఐ టెక్నాలజీలను అనుసంధానం చేసుకుంటూ, సంస్థ సమగ్రాభివృద్ధికి ఊతం ఇస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక సంస్థ లేదా బహుళ జాతి కంపెనీ (ఎంఎన్సి) పురోగతిలో మానవ వనరుల నిపుణుల పాత్ర వెలకట్టలేనిది. కంపెనీ ప్రగతిలో హెచ్ఆర్ నిపుణుల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2019 నుంచి ప్రతి ఏట 20 మే రోజుల అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ హెచ్ఆర్ డే పాటించడం జరుగుతోంది. కంపెనీ లేదా సంస్థలో ఉద్యోగుల శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిగత పురోగతి మాత్రమే తమ లక్ష్యంగా హెచ్ఆర్ నిపుణులు అమూల్య సేవలను అందిస్తున్నారు. 2025 అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం ఇతివృత్తంగా హూమనిఫై ఏఐ - లీడింగ్ హెచ్ఆర్ టుగెదర్ (ఏఐ యుగంలో మానవీయత - ఐక్యతతో మానవ వనరుల పయనాలు) అనబడే అంశాన్ని తీసుకున్నారు.

అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవ వేదికగా హెచ్ఆర్ విభాగ ఉద్యోగుల పాత్రను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించడం, సరదా క్రీడలు ఏర్పాటు చేయడం, విజయవంతమైన వ్యక్తులు చేపట్టిన విలక్షణ పద్ధతులను ప్రచారం చేయడం, హెచ్ఆర్ ఉద్యోగులకు బహుమతులు అందించడం లేదా ప్రోత్సాహక వేతనాలను విడుదల చేయడం, ఆ సిబ్బంది సేవలను ప్రస్తుతించడం, సామాజిక మాధ్యమ వేదికగా పురస్కారాలు/అభినందనలు తెలుయజేయడం, హెచ్ఆర్ విభాగ సభ్యుల యోగ క్షేమాలను తెలుసుకోవడం, వారి వ్యక్తిగత లేదా ఉద్యోగ సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. హెచ్ఆర్ నిపుణుల కృషితో పని ప్రదేశంలో ఆశావహ వాతావరణం, పని భద్రత, అధిక ఉత్పత్తి లాంటివి జరుగుతాయని తెలుసుకోవాలి.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# జీవ వైవిధ్యాన్ని రక్షించాలి



సకల జీవులకు ఆధారమైన భూమిపై జీవవైవిధ్యం ఒక సహజ ప్రక్రియ. జీవుల మధ్య భేదాన్నే జీవవైవిధ్యం అంటాం. ఇది జాతి, జన్యు, ఆవరణ, వ్యవస్థల పరంగా ఉంటుంది. ప్రకృతిలో కోట్లాది సంవత్సరాల క్రితం ప్రాణికోటి ఆవిర్భవించినది. ప్రపంచ వ్యాప్తంగా 87 లక్షల మొక్కలు, జంతు జాతులున్నాయని శాస్త్రవేత్తల అంచనా. అందులో ఇప్పటివరకు కేవలం 12లక్షల జాతులను మాత్రమే గుర్తించారు. మానవుడు జీవులలో ఒక భాగం, అందుకే మానవునికి , జీవ వైవిధ్యానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. జీవ జాతులు వాణిజ్యపరంగా, విజ్ఞానపరంగా, వైద్యపరంగా, పారిశ్రామికంగా, ఆహార పరంగా, పర్యాటకానికి ఎంతగానో దోహదపడతాయి. మానవ మనుగడకు జీవ వైవిధ్యం దోహదపడినట్లే జీవ వైవిధ్య సమతుల్యానికి మానవ జీవన విధానం కూడా దోహదం చేస్తుంది. భూగోళంపై గల జీవవైవిధ్యం ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, జీవ జాతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 2010 మే 22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవానికి నాంది పలికింది. ఈ ఏడాది అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం 'ప్రకృతితో సామరస్యం మరియు స్థిరమైన అభివృద్ధి' అనే ఇది వృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతుంది. ఈ నినాదం కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయో డైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ (KMGBF) మరియు 2030 ఎజెండా ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (S–Gs) రెండింటినీ సమగ్ర పద్ధతిలో పరిష్కరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. అంతేకాకుండా ప్రపంచ దేశాలు సకల జీవుల సంరక్షణకు రూపొంచుకొనే ప్రణాళికలలో ప్రతి ఒక్కరు భాగం కావాలని ఈ నినాదం నొక్కి చెబుతుంది.

**సంక్షోభంలో జీవ వైవిధ్యం**

పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజ వనరులపై తీవ్రఒత్తిడి పెరుగుతుంది. భూగోళం కాలుష్యానికి గురౌవుతుంది. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక రకాలుగా ధ్వంసం చేస్తున్నాడు. అడవులు నరకడం, రసాయన ఎరువులను వినియోగం, ఆకాశ హర్మ్యాల నిర్మాణాలు, ఖనిజాల కోసం పర్వతాలు తవ్వడం లాంటి చర్యల ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్షజాతులు అంతరించిపోతున్నాయి. పచ్చిక బయలు, సముద్రతీరాలు, పగడపు దిబ్బలు, చిత్తడి నేలలు అతలాకుతలం అవుతున్నాయి. భూకంపాలు, వరదలు, సునామీలు లాంటి సహజ విపత్తులు జీవ వైవిధ్యానికి పెను సవాలుగా మారాయి. గతేడాది నేపాల్ రాజధాని ఖాట్మండు పట్టణంలో 'జీవ వైవిద్యం, పర్యావరణ వ్యవస్థ సేవలపై ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్ పాలసీ ఫ్లాట్ ఫామ్(IPBES)' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హిందుకుష్ హిమాలయ పర్వత శ్రేణి గడిచిన వందేళ్లలో 70 శాతం జీవ వైవిద్యాన్ని కోల్పోయిందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.



వాతావరణ మార్పులు, పట్టణీకరణ, మితిమీరిన మానవ కార్యకలాపాలే దీనికి కారణమని పేర్కొన్నారు. మరోవైపు ప్రపంచంలోని వలస జాతుల్లో ప్రతి ఐదింటిలో ఒకటి అంతర్ధాన ముప్పును ఎదుర్కొంటున్నాయని, జాతుల సంఖ్య 44 శాతం తగ్గిపోయిందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం మానవ చర్యల వలన వన్యప్రాణుల ఆవాసాలు చెదిరి మానవ సమూహంలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద పెరగడం, కొన్ని గ్రామాలలో పులులు సంచరించడమే దీనికి నిదర్శనం. జంతువుల వేట, అక్రమ రవాణ వంటి కార్యకలాపాలతో మనిషికి, జీవులకు మధ్య భౌతిక దూరం తగ్గి, సంఘర్షణ పెరుగుతుంది.

ఫలితంగా వాటికున్న అనేక వ్యాధులు మనుషులకు కూడా సోకుతున్నాయి. గతంలో ఎబోలా, బర్డ్ ఫ్లూ, జికా నుంచీ నేటి కరోనా వరకు వన్యప్రాణుల నుండి మనుషులకు సోకినవే వ్యాధులు. ఇవన్నీ జీవ వైవిధ్య, పర్యావరణ విధ్వంసానికి నిదర్శనమే. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ఉపద్రవాలు వచ్చే అవకాశం లేకపోతే లేదనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది.

**జీవ వైవిధ్య సంరక్షణకు మైలురాయి**

21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవ జాతుల నష్టం పట్ల తీవ్ర ఆందోళన చెలరేగుతున్నది. ఈ నేపథ్యంలో యు.ఎన్ ఆధ్వర్యంలో 1992లో బ్రెజిల్లో జరిగిన ధరిత్రీ సదస్సు జీవవైవిధ్య పరిరక్షణను నొక్కి చెప్పింది. తదుపరి 'కాప్' సమావేశాల్లో ఆధునిక జీవవైవిధ్య సవాళ్లను అధిగమించే దిశగా చర్చలు జరిగాయి. డిసెంబర్ 2022లో జరిగిన బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ (COP15) చైనా, కెనడా దేశాల్లో ఉమ్మడిగా జరిగింది. ఇందులో 2030 నాటికి జీవ వైవిధ్య నష్టాన్ని అరికట్టి, పర్యావరణ వ్యవస్థల పునరుద్దరణకు 'కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్' ను ప్రపంచ దేశాలు అమోదించాయి. ఇది గొప్ప మైలురాయిగా పేర్కొనవచ్చు. ఈ ఫ్రేమ్ వర్క్‌ను భారతదేశంలోనీ తెలంగాణ రాష్ట్రం మొదటగా ఆమోదించడం అభినందనీయం. భారత దేశం అనాదిగా జీవ వైవిధ్యానికి అనుకులతను కలిగివున్నది. ప్రపంచంలో అతిపెద్ద జీవ వైవిధ్య దేశాలలో భారత్ ఒకటి. నాలుగు జీవ వైవిధ్య ప్రజ్వలన కేంద్రాలు(hotspot) ఇక్కడ ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి ఒప్పందాలకనుగుణంగా భారత్ కూడా అంతరించిపోయే అరుదైన జాతుల సం రక్షణకు పలు చర్యలు చేపడుతుంది. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం1972 తీసుకు రావ డం జరిగింది. జంతువుల సంరక్షణకు వివిధ ప్రాజెక్టులు మరియు వాటినీ గణించి పలు చర్యలు చేపడుతుంది. అంతేకాకుండా బయోస్ఫియర్ రిజర్వ్, జాతీయ పార్కులు, అభయారణ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. గతేడాది గ్రేట్ ఇండియన్ బస్టార్డ్ పక్షుల పరిరక్షణ పై సుప్రీంకోర్టు కమిటీ వేసింది. ఈ విధమైన చర్యలు చేపడుతున్నప్ప టికి గ్రేట్ ఇండియన్ బాస్టర్డ్, రాబందులు, పిచ్చుకలు,కాకులు,బెంగాల్ టైగర్,ఆసియా టిక్ లయన్, రెడ్ పాండా మరియు ఇండియన్ రైనోసర్స్ లాంటి అనేక అరుదైన జాతులు ప్రమాదంలో పడడం ఆందోళన కలిగిస్తుంది. కావున ప్రపంచ దేశాలు చట్ట పరమైన, విధాన పరమైన చర్యలతో జీవ వైవిధ్య సంరక్షణకు మరింత కృషి చేయాలి. ఇప్పటికే వాతావరణ మార్పులతో జీవ జాతులు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమం లో పర్యావరణ హిత చర్యలతో సుస్థిర అభివృద్ధికి తోడ్పడాలి. జీవ వైవిద్యాన్ని జాతీయ సంపదగా భావించాలి. జీవ వైవిధ్య చట్టాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలి.

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

## విచక్షణ జ్ఞానం

జల ప్రాణులకు ఎవరు చెప్పారు
నీటిలో తప్ప బయట బతకలేమని
బయటకు వస్తే ప్రాణాలే పోతాయి అని.
పక్షులకు ఎవరు చెప్పారు
ఆకాశంలోనే సంచరించాలని
అవసరమైతే తప్ప భూమి పైకి రావద్దని.

అడవి జంతువులకు ఎవరు చెప్పారు
తనకున్న ప్రదేశాన్ని విడిచిపెడితే
కష్టాలకు గురై ఇబ్బంది పడతామని.
క్రూర మృగాలకుఎవరు చెప్పారు
వేటాడుకుని తినడమే ఉత్తమమని
ఒకరికి బానిస కాకుండా ఉండాలని.

మహా పురుషులకు ఎవరు నేర్పారు
ఎంత లోకజ్ఞానం సంపాదించిన
తనదైన ముద్ర తనకు ఉండాలని.
ఎంత నేర్చుకున్నా ,ఎంత సంపాదించిన
ఎంత గొప్ప పదవులను అలంకరించిన
విచక్షణ జ్ఞానం లేకుంటే ఆ జీవితం వ్యర్థం

**- నెరువట్ల చైతన్య**
9491470746

# విద్యార్థిని సంస్కరించే విద్య కావాలి



విద్య యొక్క ముఖ్య లక్ష్యం విద్యార్థులలో సమగ్ర మూర్తిమత్వాన్ని పెంపొందించడం. ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా వివిధ రకాల సహజ నైపుణ్యాలు ఉంటాయి. వాటిని వెలికి తీసే లాగా విద్యా వ్యవస్థ ఉండాలి. కానీ నేడు కేవలం విద్య లక్ష్యం ర్యాంకుల సాధన అయింది. కేవలం పాఠ్య పుస్తకాలలోని జ్ఞాన సముపార్జన మాత్రమే చదువు అనే స్థాయికి నేటి విద్యా విధానం వెళ్ళింది.

**విద్యలో కార్పొరేటీకరణ సంస్కృతి**

విద్యలో కార్పొరేటీకరణ సంస్కృతి క్రమ క్రమంగా పెరుగుతుంది. విద్యావ్యవస్థతో సంబంధం లేని వారు కూడా విద్యాలయాలను కేవలము ధనార్జనే ధ్యేయంగా స్థాపిస్తున్నారు. డొనేషన్లు, మార్కులు, ర్యాంకుల సంస్కృతిలో మన సమాజం కొట్టుకుపోతుంది.

**విద్యా విధానం- గురుశిష్యుల సంబంధం**

ప్రాచీన విద్యా విధానంలో ప్రతి విద్యార్థి పైన వ్యక్తిగత శ్రద్ధ ఉండేది. కేవలం విద్య మాత్రమే కాకుండా కష్టసుఖాల గురించి ఆకళింపు చేసుకొనే అవకాశం ప్రాచీన విద్యా విధానంలో ఉండేది. నేడు ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు మధ్య మానసిక అంతరం అంతకంతకు పెరిగిపోతోంది. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రంగాలలో ఆసక్తి కలిగేలా విద్యాబోధన సాధించాల్సిన అవసరం ఉంది.

**పిల్లల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర**

పిల్లల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర కూడా చాలా కీలకమైనది. పిల్లలు ఎలాంటి పాఠ్యాంశాలపైన, సహపాఠ్య కార్యక్రమాల పైన ఆసక్తి చూపుతున్నారో గమనించి ఆయా అంశాల్లోనే వారికి తర్ఫీదు ఇవ్వాలి. చదువులో రాణించే విద్యార్థులను చూపెట్టి వారిని ఆదర్శంగా తీసుకోమని తమ పిల్లలపై ఒత్తిడి పెంచడం అసమంజసమైన విషయం. పిల్లల ఆసక్తికి అనుగుణంగా



వారి మనోభావాలను గుర్తించి చదివించడం తల్లిదండ్రుల బాధ్యత. అప్పుడే పిల్లల మానసిక ఎదుగుదల జరుగుతుంది

**విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల పాత్ర**

ఒక విద్యార్థి మేధో సామర్థ్యం ఎక్కువ, మరో విద్యార్థికి తక్కువ ఉన్నప్పుడు ఉపాధ్యాయుడు తక్కువ స్థాయి గ్రహణశక్తి ఉన్న విద్యార్థికి మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. ఉపాధ్యాయుడు పిల్లలు తాము చదువుకోవాల్సిన పాఠ్యాంశాలపై మక్కువ పెంచుకుసేలా కృషిచేయాలి. కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితే ఫలితాలు ఎక్కువగా ఉంటాయని అవగాహనను కలిగించాలి.

కఠిన పేదరికంతో పుట్టి కష్టపడి చదివిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, స్వయంకృషితో ఎదిగిన వ్యక్తుల విజయ గాథలు పిల్లలకు తెలియజెప్పాలి. స్ఫూర్తిదాయకమైన ప్రవర్తన ఉండేలాగా పిల్లలని తీర్చిదిద్దాలి. పిల్లల చదువులో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల సమిష్టి కృషి కూడా అవసరం. అప్పుడే వారు బాధ్యతా యుతమైన భావిభారత పౌరులుగా తయారవుతారు. కేవలం తరగతిగది ప్రపంచంగా భావించే ప్రస్తుత విద్యా విధానాన్ని పూర్తిగా సంస్కరించిన బాధ్యత అందరిపైనా ఉంది. నూతన విద్యా వంతమైన సమాజాన్ని నిర్మించేందుకు, విద్యార్థులు అందరూ ఇష్టపడి చదువుకునేందుకు, తమలోని అంతర్గత సహజ నైపుణ్యాలను వెలికితీసే విద్యావిధానం కొరకు, విద్యార్థి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, సమాజం ప్రతి ఒక్కరూ భుజం భుజం కలిపి కృషి చేయాలి.

**- పిన్నింటి బాలాజీ రావు**
9866776286

# అగ్గి పిడుగు మన అల్లూరి



విప్లవం పేరు చెబితే వెంటనే ఠక్కున గుర్తొచ్చేది విప్లవ వీరుడు తెలుగు జాతి ముద్దు బిడ్డ. అల్లూరి సీతారామరాజు!! బ్రిటీషర్లను గడగడలా డించి, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరపుత్రుడు. భరతమాత ముద్దు బిడ్డ అల్లూరి సీతారామరాజు. అల్లూరి పేరు చెబితే మన్యం పులకిస్తుంది. గుండె ఉప్పొంగుతుంది. ఆ పేరు మన్యానికి విప్లవ నినాదం. ఉప్పొంగే ఆవేశానికి ప్రతీక. తెల్లదొరల పెత్తనానికి ఉత్పాతం లాంటిది ఆయన పేరు. అడుగు పిడుగై..అగ్గి పిడుగై మాట తూటాగా పేలి..తెల్లవాడి గుండెల్లో నిదురించిన పౌరుషాగ్ని మన అల్లూరి సీతారామరాజు.

అది భరతమాత తెల్లోడి కబంధ హస్తాల్లో నలిగిపోతున్న రోజులు. ఉత్తర భారతంలో స్వతంత్రోద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజులు అలాంటి సమయంలోనే పశ్చిమ గోదావరి జిల్లా అడవుల్లో ఓ అగ్నికణం పుట్టింది.. ఆ అగ్ని కణమే దావాణలంలా వ్యాపించి బ్రిటీష్ సామ్రాజ్య గుండెల్లో వణుకు పుట్టింది.. అలా తెల్లోడి పెత్తనం మీద గర్జించిన తెలుగు తేజమే అల్లూరి సీతారామరాజు.

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్ల దొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఓ అధ్యాయం. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే అని నమ్మిన అల్లూరి సీతారామరాజు తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించారు.

మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి.. కొన్నేళ్లపాటు సమరశీల ఉద్యమాలకు అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించారు.

తెలుగు వీర లేవరా, దీక్షబూని సాగరా... దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా... అంటూ భరతమాత విముక్తి కోసం బ్రిటీషువారిని గడగడలాడించిన మన్యం వీరుడు మన అల్లూరి సీతారామరాజు.

అల్లూరి ఒక వ్యక్తి కాదు ఆయనో మహోజ్వల శక్తి. ఆయన జీవితం విప్లవానికి ఒక సంకేతం.

స్వతంత్రం సాధించటానికి ఆయుధాలతో సుశిక్షుతులైన సైనికులు కాదు. అది సాధించాలన్న కాంక్ష చాలని నిరూపించిన అసలు సిసలు భారతీయుడు. అందుకే లోకజ్ఞానం లేని అడవి బిడ్డలనే ఆయుధాలుగా మార్చి తెల్లదొరలు గుండెలు చీల్చాడు..

సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు.

అడవి బిడ్డలైన గిరిజనులను ఏకంచేసి... ఆ ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు గిరిజనులదేనని ఎలుగెత్తి చాటాడు. ఈయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. పోడు వ్యవసాయానికి పన్ను కట్టక్కర లేదన్నాడు, గిరిజనులను నిలువు దోపిడీ చేస్తున్న దళారుల మీద, వారికి అండదండలుగా ఉన్న బ్రిటీషువారిమీద అల్లూరి తన విల్లును ఎక్కుపెట్టాడు. ప్రతీ గిరిజనున్ని ఒక గెరిల్లా యోధునిగా మార్చి తెలుగు నేలకు స్వతంత్ర పోరాట మార్గం చూపాడు.

సమాచారం ఇచ్చి మరీ పోలీసుస్టేషనులపై దాడుల నిర్వహించి బ్రిటిషు అధికారుల్లో ముచ్చెమటలు పట్టించాడు. అయితే అదే ఏడాది అల్లూరి సీతారామరాజు విప్లవదళానికి మొదటి ఎదురుదెబ్బ తగిలింది. 1922 డిసెంబరు 6న జరిగిన పోరులో 12 మంది అనుచరులను రామరాజు కోల్పోయాడు.ఆ తర్వాత రామరాజు కొన్నాళ్లు ఎలాంటి పోరాటాలు జరుపలేదు ఆ సమయంలో ఆయన మరణించాడనే పుకార్లు కూడా వ్యాపించాయి.

అయితే అల్లూరి 1923 సంవత్సరం ఏప్రిల్ నెలలో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరోసారి దాడులకు దిగాడు.

కాని అల్లూరికి సాయం చేస్తున్నారన్న నేపంలో బ్రిటీస్ అధికారులు మన్యం ప్రజలను వేధిచటం మొదలు పెట్టారు.. తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం వీరులకు రక్షణ కల్పించలేని రామరాజు లొంగిపోవాలనుకున్నాడు.. అలా అయిన మన్యం ప్రజలకు వేదింపులు తగ్గుతాయని భావించాడు.

తాను స్నానానికి చేరువు దగ్గరకు రాబోతున్నట్టుగా తన అనుచరుల ద్వారా బ్రిటీష్ అధికారులకు సమాచారం అదించాడు రామరాజు.

1923 మే 7న ఏటి ఒడ్డున స్నానం చేస్తుండగా ఆయనను బంధించిన పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టకుండానే అదే రోజున కాల్చిచంపారు. ఆయుదం చేతిలో లేని అల్లూరిని బ్రిటీష్ పోలీసులు ఆయన చెట్టు కట్టేసి కాల్చి కసి తీర్చుకున్నారు. కాని బ్రిటీష్ అధికారులు ఓ నాయకున్ని చంపగలిగారు కాని ఆయన ప్రజల్లో రగిలించిన.. స్వతంత్ర ఆకాంక్షను మాత్రం ఆర్పేయ లేకపోయారు.. తెలుగుతేజం అల్లూరి మరణం లేని విప్లవ వీరుడు.. తెలుగు జాతికి, దేశానికి స్పూర్తి ప్రధాత.

అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం. సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం. సమరగీతం.. ఉద్యమ జ్వాల. తెలుగు నేల మీద కూడా స్వతంత్ర సమరానికి బీజాలు వేసిన మహానాయకుడు అల్లూరి జయంతి సందర్భంగా ఒక్కసారి ఆ మహానాయకుని మరోసారి ఘన నివాళి అర్పిద్దాం

**- అనంతాత్మకుల కొండబాబు**



# భారత్, 'ఘన' సహకారం

భారత ప్రధాని మోదీ జులై 2 నుంచి జులై 9 వరకు ఐదు దేశాల పర్యటనలో ఉన్నారు. ముందుగా ఘన దేశానికి చేరుకున్నారు. ఇక్కడ ఘన దేశం గురించి టూకిగా ఘన దేశం పశ్చిమ ఆఫ్రికాలో ఉన్న దేశం. ఈ దేశం పూర్వం బ్రిటీష్ గోల్ కోస్ట్, టొగొలాండ్‌లతో ఉన్న దేశం. 1957 మార్చి 6 వ తేదీన బ్రిటీష్ హస్తాల నుంచి స్వేచ్ఛ పొందింది. 1960 జులై 1న కామన్ వెల్త్ లో ఘన దేశం స్వతంత్ర గణ తంత్ర రాజ్యాంగ ఉంది. ఘన దేశపు రాజధాని అక్రా. కరెన్సీ సిడి. మాట్లాడే భాషలు ఆంగ్లం, ట్వీ, సాంటి, గా, ఈవ్, దగ్బానీ భాషలు మాట్లాడుతారు. మతం క్రైస్తవం, ఇస్లాం. భారత్‌లో మాదిరి ప్రధానంగా వ్యవసాయక దేశం.'కొకొ'ప్రధాన పంట. ప్రధాన ఎగుమతులు కలప,బంగారం,మాంగనీసు. దిగుమతులలో ఆహార పదార్థాలు, వస్త్రాలు, యంత్ర సామాగ్రి, వినియోగ వస్తువులు మొదలైనవి. గత మూడు ముప్పైసంవత్సరాల కాలంలో ఘన ను సందర్శించిన మొదటి ప్రధాని మోదీ. ఘన దేశ అధ్యక్షుడు మహామా మోడీకి స్వాగతం పలికారు. మోదీకి, ఘన దేశపు అత్యున్నత అవార్డు అయిన 'ఆర్డర్ ఆఫ్ దిస్టార్ ఆఫ్ ఘన' పురస్కారంతో సత్కరించారు.ఈ అవార్డు 140 మంది భారతీయులకు అంకితం అంటూ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆ దేశ పార్లమెంటు సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ 'భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది' అని చెబుతూ మా దేశంలో దాదాపు చిన్నా, చితుక పార్టీలు రెండు వేల ఐదు వందలు ఉన్నాయాన గానే అక్కడి సభ్యులు అచ్చెరువొందారు. ఇరవై రెండు భాషలు ఉన్నాయి. 29 రాష్టాలలో వేరు వేరు పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ఇంకా వేలాది మాండలికాలు ఉన్నాయి. అంత వరకు మోదీ ప్రసంగాన్ని విన్న ఘన పార్లమెంటు సభ్యులు 2,500 పార్టీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోతున్నారు. మీరు భారత ప్రధానిగా ఉండటం మాకు ఆనందం అన్నారు. మహామా మాట్లాడుతూ ఒక అతి పెద్ద ప్రజాస్వామ్యం దేశం నేతతో ఖనిజాలు, రక్షణ, ఎనర్జీ, సముద్ర భద్రత వీటి విషయంలో కలసి పని చేస్తాం అన్నారు. భారత్, ఘన దేశాలు స్నేహం కొసం కృషి చేస్తూ, సంస్కృతి సంబంధాలు మెరుగు పరచుకుంటాయి. అనేకనేక విషయాలలో తగిన భాగస్వామ్యం ఏర్పరచుకుని



ముందుకు సాగుతావని మహమా, మోదీ చెప్పడం గమనార్హం.

ఘనతో మా మైత్రి విడిపోదు అన్నప్పుడు మహమా మోదీని అభినందించాడు. ఘన దేశపు సంస్కృతితో భారత సంస్కృతి ముడి పడి ఉన్నాయి అని, ఘన దేశపు సంస్కృతిని గౌరవించారు. అక్కడ ఉన్న ప్రవాస భారతీయులతో మమేకం అయ్యారు. ఘన దేశం నుంచి మోదీ, ట్రిని డాడ్ అండ్ టొబాగ్ ప్రధాని కమ్లా పెర్సాద్ బిసెర్‌తో కలసి ముప్పై ఎనిమిది మంత్రులు అపురూప స్వాగతం పలికారు. మోదీ ఆ దేశపు ప్రధానికి మహా కుంబ్, సరయు నది పవిత్ర జలాలు ఆమెకు అందించారు. వీటితో పాటు రామ మందిర ప్రతిమ ను కూడా బహుమతిగా ఇచ్చారు. అక్కడి వారితో మా భారత్ లో ప్రయాగ్ రాజ్ లో మహా కుంబ్ జరిగింది. వేలాది మంది పాల్గొన్నారు అని మహా కుంబ్ వివరాలు తెలియజేశారు. దీనికి ఆ దేశ ప్రధాని మాట్లాడుతూ మోదీ వంటి ఉత్త మోత్తమ ప్రధాని భారత్‌కు ఉండటం గర్వకారణం, మాకు ఆనందాన్ని ఇచ్చింది అని కితాబు ఇచ్చింది. అన్నీ రంగాలలో భారత్ తో కలసి నడుస్తామని చెప్పడం, భారత్ సహకారం మాకు అవసరం అని పేర్కొన్నారు. అక్కడ నుంచి మోదీ అర్జెంటైనాకు వెళతారు. మరియు బ్రెజిల్, నమీబియా దేశాలను కూడా సందర్శిస్తారు.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

## మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 04 (మనం ప్రతినిధి): మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి , కొణిజెటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దొడ్డి కొమురయ్య, కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని , ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. కొణిజెటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి సురేష్ , ఇతర జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కోనరావుపేట, జూలై 4 (మనం ప్రతినిధి): జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ అన్నారు.శుక్రవారం కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కు 5 కోట్ల 14 లక్షల రూపాయలతో చేపట్టిన అదనపు మౌలిక వసతుల నిర్మాణం పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు.కేంద్ర మంత్రి విద్యార్థులు మార్చి ఫాస్ట్ , సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులచే ఏర్పాటు చేసిన వైజ్ఞ విజ్ఞాన పరికరాలు ద్వారా ఏర్పాటు చేసిన ప్రదర్శనకు తిలకించి వాటి వివరాలను ఆరా తీశారు. అనంతరం ఏఐ సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించి తరగతి లో విద్యార్థులతో విద్యాభ్యాసన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ మాట్లాడుతు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5 కోట్ల 14 లక్షల రూపాయలతో స్టాఫ్ క్వాటర్స్, కాంపౌండ్ వాల్, అంతర్గత సీసీ రోడ్లు, లైటింగ్, బాలురు బాలికల వార్డెన్ గృహం నిర్మించడం జరుగుతుందని అన్నారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన దిశగా కృషి చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రభుత్వం ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్లో అందిస్తున్న సౌకర్యాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆధునిక సాంకేతికత ద్వారా క్లిష్టమైన సమస్యల పరిష్కారం లభిస్తుందని, నూతన టెక్నాలజీ పిల్లలు అవగాహన కల్గి ఉండాలని అన్నారు. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి మంచి దేశ పౌరులు తయారు కావాలని అన్నారు. భారత దేశము ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మనమంతా కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆర్.ఎస్. యాదవ్, ఉపాధ్యాయులు ,ప్రజా ప్రతినిధులు , విద్యార్థులు , ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి

- కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల, జూలై 4 ( మనం ప్రతినిధి): వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్ర వారం జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఏక్ పెడ్ మా కే నామ్ ' మన తల్లి పేరిట ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో కలెక్టర్ ప్రారంభించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 ను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని సహకార సంఘాల పరిధిలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జగిత్యాల పాక్స్ లో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ భాగస్వామ్యం కావడం ప్రశంసనీయం అన్నారు. అనంతరం జిల్లా సహకార అధికారి సి .హెచ్. మనోజ్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఒకే రోజు 2500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సహకార సంఘాల పరిధి లోని అన్ని కార్యాలయాలు, గోదాముల పరిధి లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, అర్బన్ తహశీల్దార్ రామ్ మోహన్,ప్యాక్ జగిత్యాల అధ్యక్షుడు పత్తి మహిపాల్ రెడ్డి, కల్లెడ పాక్స్ చైర్మన్ సందీప్ రావు సహకార శాఖ అధికారులు సాయి కుమార్, సుజాత జగిత్యాల పీఏసీఎస్ కార్యదర్శి వేణు జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయ అధికారి వినీల తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి జెండా ఎగరడం ఖాయం

- ప్రజలు బిఆర్ఎస్ పార్టీని నమ్మే స్థితిలో లేరు
- 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- బీజేపీ నేతలు



సుల్తానాబాద్, జులై 04 (మనం న్యూస్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ లో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందారని 420 హామీలు ఇచ్చి 16 నెలలోనే ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత ఏర్పడిందని ప్రస్తుతం ప్రజలందరూ బిజెపి వైపు చూస్తున్నారని ప్రపంచ దేశాలు గర్వించదగ్గ స్థాయికి 11 సంవత్సరాల లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని తీసుకుపోయారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బీజేపీ సత్తా చాటేలా కార్యకర్తలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని ప్రజలు ఆ పార్టీని నమ్మే స్థితిలో లేరని అన్నారు. 9 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారన్నారు.జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పరచకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. ఈ సమావేశంలోబీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మీసా అర్జున్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, జిల్లా కార్యదర్శి సౌదరి మహేందర్ యాదవ్,ప్రాబరి కమని రాజేంద్రప్రసాద్, కొమ్ము తిరుపతి, లింగ రెడ్డి,నారాయణ స్వామి, జ్యోతిబసు, నిర్మల, వనజ, చాతరాజు రమేష్, రఘుపతి రావు, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్, భాగ్యలక్ష్మి, దొంగల శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, కొమ్మిడి తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, శశి వర్ధన్ లతో పాటు దాదాపు 200 మంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల సేవలు చిరస్మరణీయం



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఘనంగా రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి

రాజన్న సిరిసిల్ల, జూలై 4 ( మనం ప్రతినిధి): మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి, వేడుకలను దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ మరియు జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

### దొడ్డి కొమురయ్యకు నివాళి

జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో డి.వై ఎస్ ఓ రాందాస్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజ మనోహర్ రావు,జిల్లా అధికారులు , సిబ్బంది, ఆయా కుల సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం 'ఆత్మీయతా అభివృద్ధి కార్యక్రమం' ప్రారంభం



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రాజెక్టు శక్తి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి జూలై 04 (మనం ప్రతినిధి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం 'ఆత్మీయతా అభివృద్ధి కార్యక్రమం' ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో ప్రాజెక్టు శక్తి అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు శక్తి కార్యక్రమం అమలు కోసం పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన పలు కార్యక్రమాలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా పాఠశాలల్లో విద్యార్థులు తమ పాఠశాలలను సురక్షిత, గౌరవ భరితమైన స్థలంగా భావించి, సమానంగా పాల్గొనే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించబడిందని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మీయత భావం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు లింగ భేదం లేకుండా తరగతులలో, పాఠశాల కార్యకలాపాలలో సమానంగా పాల్గొనడానికి అవకాశం కల్పించబడుతుందని, ప్రతి విద్యార్థి గౌరవించబడినట్టు, అంగీకరించబడినట్టు, చేర్చబడినట్టు, మద్దతు లభిస్తున్నట్టు అనుభూతి చెందే వాతావరణాన్ని పాఠశాలల్లో ఏర్పరచడమే దీని లక్ష్యమని అన్నారు. పాఠశాలోని హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు కూడా తాము గౌరవించబడినప్పుడు, అంగీకరించబడినప్పుడు తమలో ఉత్తమతనం బయటపెడతారని, అదే విధంగా విద్యార్థులకూ అదే అవకాశాన్ని కల్పించాలని, పాఠశాల వారికో సురక్షిత స్థలంగా అనిపిస్తే మాత్రమే వారు ఉత్సాహంతో తరగతులకు హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి దశగా డేటా సేకరణ చేపడుతున్నారని , విద్యార్థుల భావజాలాన్ని అర్థం చేసుకోవడానికి, అవసరాలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా వర్క్షాప్ నిర్వహించబడుతోందని, ఇందులో డేటా ఎలా సేకరించాలి, దాన్ని ఎలా విశ్లేషించాలి అనే అంశాలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తిచేసుకోవాలి

- ప్రభుత్వం అందించే సాయం పొందండి
- చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



రాజన్న సిరిసిల్ల, జూలై 4(మనం ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించు కోవాలని.. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గంభీరావుపేట మండలం గోరంటాల, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, వీర్నపల్లి మండలాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిర్ణీత స్థలంలో ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారిగా మొత్తం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అధికారులు సహకరించాలని సూచించారు. గోరంటాలలో ఇందిరమ్మ ఇండ్ల పనుల్లో జాప్యం అవుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. వీర్నపల్లి ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలించి, అధికారులను అభినందించారు.

### చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

గంభీరావుపేట మండలం గోరంటాలలో లోతు వాగు వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లోతు వాగు వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి సర్వే చేయాలని, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటన లో డీఆర్డీఓ శేషాద్రి, ఎంపీడీవోలు తాసిల్దార్లు, సంబంధిత అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై ఆటో డ్రైవర్ల అసంతృప్తి

- మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లు
- హామీలు నెరవేర్చకపోతే ప్రభుత్వానికి గుణపాఠం
- ఆటో యూనియన్ జేఏసీ హెచ్చరిక



పెద్దపల్లి జూలై 04 (మనం ప్రతినిధి): తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆటో డ్రైవర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్,రాష్ట్ర చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ ఆరోపించారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్క్లబ్లో పెద్దపల్లి జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంద రవికుమార్,గాజుల ముఖేష్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం వల్ల తమ జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం,ఇళ్లు లేని వారికి ఇళ్ల నిర్మాణం వంటి అనేక వాగ్దానాలు చేశారని,ఈ హామీలను నమ్మి ఆటో డ్రైవర్లు కాంగ్రెస్కు ఓటు వేసి గెలిపించారని పేర్కొన్నారు. అయితే,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా,ఒక్క హామీ కూడా నెరవేరలేదని యూనియన్ నాయకులు మండిపడ్డారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్ల జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిందని వారు వాపోయారు.ఈ పథకం అమలుతో తమ ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని, ప్రభుత్వం దీని గురించి తెలిసినా తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తుపై అభద్రతాభావంతో ఇప్పటివరకు వంద మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని వారు వెల్లడించారు. రాబోయే కేబినెట్ సమావేశంలో తమ సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యూనియన్ నాయకులు కోరారు.సంక్షేమ బోర్డు ఏర్పాటు,రూ.12 వేల ఆర్థిక సహాయం వంటి తమ ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలైన సర్పంచ్,ఎంపీటీసీ, జెడ్పిటిసి, కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో తమ బలాన్ని ప్రదర్శిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేకుంట్ల సురేష్,జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల నాంపల్లి,చిలుముల కుమార్,తొగరి సుధాకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుధాల సదానందం,జిల్లా కోశాధికారి లంకెల వెంకటేష్,బి పవర్ హౌస్ అడ్డ ప్రధాన కార్యదర్శి ఎస్.కె జబ్బార్,గడ్డపల్లి గ్రామ అధ్యక్షులు బండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్తో బాధితులకు ఊరట

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



హుజురాబాద్, జూలై 4 (మనం న్యూస్): నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు కొంతమేర ఊరట కలిగిస్తున్నాయని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బేతిగల్, నర్సింగాపూర్, వీణవంక, రెడ్డిపల్లి, ఘన్ముక్ల, మల్లన్న పల్లి, బొంతపల్లి, గంగారం, ఎలబాక, చల్లూరు, ఇప్పలపల్లి, మామిడాలపల్లి, మల్లారెడ్డిపల్లి, దేశాయిపేట, కిష్టంపేట, నరసింహులపల్లి, శ్రీరాముల పేట, హిమ్మత్ నగర్, కొండపాక, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల, 88 వేల 500 విలువ చేసే చెక్కులను ఆయన ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి చెక్కులను వీలైనంత తొందరగా అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. 2014 కంటే ముందు సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఎవరికి తెలిసేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రిగా కెసిఆర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ బడ్జెట్ను పెంచారని గుర్తు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదల వైద్య ఖర్చుల చెల్లింపులను మరింత సులభతరం చేశారని గుర్తు చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో వేలాదిమందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు.

### తులం బంగారం ఏమైంది...?

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడం లేదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పారని అది ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు ను నిలిపివేయడంతో అన్నదాతలు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. రైతు భరోసా పథకం కూడా అందరికీ రావడం లేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో.. బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ప్రజలంతా మళ్ళీ ముక్తకంఠంతో కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారని, కేసులతో, అరెస్టులతో ప్రజా పోరాటాలను ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ వాలా బాలకిషన్ రావు, మాజీ ఎంపీపీ రేణుక తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ వనమాల సాదవ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి, వీణవంక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న.. రిస్క్యూ ఆపరేషన్

- డీఎన్ఏ రిపోర్టుల ద్వారా గుర్తింపు ప్రక్రియ వేగవంతం
- బాధిత కుటుంబాలకు తాత్కాలిక ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రభుత్వం



**సంగారెడ్డి, జూలై 4(మనం ప్రతినిధి):** పాశమైలారం పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదఘటన రిస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సంఘటనా స్థలంలో ఇప్పటికీ సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. మిస్సయినవారి వివరాలు లభించే వరకు రెస్క్యూటీమ్లు శోధన కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య తెలిపారు. ప్రస్తుతం ఇంకా 9 మంది ఆచూకీ లభ్యం కాలేదు. వీరి కోసం మృతదేహాల శేషాలు, వ్యక్తిగత వస్తువులు, ఆధారాలు అన్నింటినీ సేకరించి, అవసరమైన డిఎన్ఎ శాంపిల్స్ ల్యాబ్కు పంపించడం జరిగిందన్నారు. డంపింగ్ చేసిన ప్రాంతంలో ప్రత్యేక బృందాలు శోధన కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు 39 మంది మృతులను డిక్లయిడ్ చేశారు. ఇందులో 5 మంది గుర్తించని మృతదేహాలకు సంబంధించి రిపోర్టులు వచ్చే వరకు వేచి చూస్తున్నామన్నారు. డిఎన్ఏ టెస్టింగ్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఫోరోనెక్స్ ల్యాబ్ నుండి వచ్చే డిఎన్ఎ రిపోర్టులు ఆధారంగా మృతుల గుర్తింపు చేపడుతున్నారు. ఇప్పటివరకు 14 మంది మృతుల రిపోర్టుల కోసం నిరీక్షణ కొనసాగుతోంది. బాధిత కుటుంబాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం పాశమైలారం వద్ద ప్రత్యేకంగా ఒక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ 11 మంది మిస్సింగ్ అయిన వ్యక్తుల కుటుంబీకులకు తాత్కాలికంగా వసతిని ఏర్పాటు చేశామన్నారు. వారికి అవసరమైన భద్రత, ఆహారం, ఆరోగ్య సదుపాయాలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాత్కాలిక తక్షణ ఆర్థిక సహాయం

మృతి చెందిన కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున, గాయపడ్డ వారికి రూ.50,000 చొప్పున తాత్కాలిక సహాయం వెంట వెంటనే అందజేస్తున్నామన్నారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించిన వెంటనే ఫ్రెజర్ అంబులెన్స్ ఏర్పాటుచేసి, పోలీస్ ఎస్కార్ట్తో వారి స్వగ్రామాలకు తరలించడం జరుగుతోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ప్రస్తుతం 23 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యేక వైద్య సిబ్బంది ఏర్పాటుచేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. మానసికంగా, శారీరకంగా వారికి సహాయపడే విధంగా అవసరమైన కౌన్సెలింగ్ సేవలు అందజేస్తున్నామన్నారు. ప్రమాదానికి గురైన ప్రతి కుటుంబానికి సమాచారం అందించడం జరుగుతోంది. వారు సహాయ కేంద్రానికి వచ్చిన వెంటనే డిఎన్ఎ శాంపిల్స్ సేకరించడం, వారి మృతుల సమాచారం సమర్పించడం జరుగుతోంది. పారదర్శకంగా మొత్తం ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అధికారులు సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, ఫైర్ డిపార్ట్మెంట్, ఫారెన్సిక్, డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్లు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. తక్షణ ఆర్థిక సాయం, వైద్య సహాయం, భద్రతా ఏర్పాట్లు, డిఎన్ఎ గుర్తింపు ప్రక్రియ ... అన్నింటిలోనూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రమాదం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి బాధిత కుటుంబానికి అన్ని రకాల భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు . త్వరితగతిన మిగిలిన మిస్సింగ్ వ్యక్తులను గుర్తించే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు.



# త్యాగానికి ప్రతీక మొహర్రం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- దస్తగీర్(చోటు) ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ

**రామచంద్రాపురం, జూలై 4(మనం న్యూస్):** మత సామరస్యానికి, త్యాగనిరతికి ముహర్రం పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ముహర్రం సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి నిర్వహించుకునే పండుగ మొహర్రం అన్నారు. ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం నుంచి నేటి సమాజం తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేష్, షకీల్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

# మాటలకే పరిమితం.. కాంగ్రెస్ ప్రభుత్వం

- ఉచిత బస్సుల పేరుతో ఊకదంపుడు ఉపన్యాసాలు
- యూరియా లేక సతమతమవుతున్న రైతులు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**మిరుదొడ్డి, జూలై 4(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకు మాత్రమే పరిమితమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి యాదవ సంఘం, పిఎసిఎస్ భవనాలను ప్రారంభించారు. భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేసి అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఫర్నీచర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత జిల్లాలో ఆరోగ్య మంత్రి ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలు లేకుండా పోయాయన్నారు. హరీష్ రావుకు ఉన్న తాపత్రయంలో ప్రస్తుతం ఉన్న వైద్య శాఖ మంత్రికి అనువంత కూడా లేదని ఆరోపించారు. జిల్లాలో ఏ ప్రభుత్వాసుపత్రికి వెళ్లినప్పటికీ రోగులు కనిపించడం లేదని, ఆసుపత్రులు మూలన పడే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రులలో వైద్యులు, నర్సులు లేకపోవడంతో రోగులు వెనుదిరగాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో నెలకొందన్నారు. ఉచిత బస్సులంటూ ఊకదంపుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులకు తగ్గ బస్సులను ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దుబ్బాక బస్ డిపోలో కేవలం 33 బస్సులు మాత్రమే ఉన్నాయని, వాటితో ప్రయాణికులకు ఎలా సౌకర్యం అవుతుందని ప్రశ్నించారు. బస్సులు ఏర్పాటు చేయాలని ఎం.డి. సజ్జనార్ ను కలిస్తే తన దగ్గర బడ్జెట్ లేదని చేతులెత్తేసారని చెప్పడం జరిగిందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందకపోవడంతో యూరియా విషయంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టించారని, పారిశుద్ధ్య లేక కంపుకొడుతుండడంతో, చెత్త ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి పనులు చూపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గత సంవత్సరం పాఠశాలలో 137 మంది విద్యార్థులుంటే ఈ విద్యా సంవత్సరం 164 మందికి పెరగడం అభినందనీయమన్నారు. అయినప్పటికీ విద్యార్థుల సంఖ్యను ఇంకా పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి, దుబ్బాక పిఏసిఎస్ చైర్మన్ కైలాస్, బీఆర్ఎస్ నాయకులు తోట కమ లాకర్ రెడ్డి, వల్లాల సత్యనారాయణ, లింగం, హైమద్, యాదగిరి, శ్రీను, వంజరి శ్రీనివాస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



**సంగారెడ్డి, జూలై 4(మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ మైలారంశుక్రవారం ఆయన పటాన్చెరువు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్ సెక్రటరీ రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ,అరవింద్ కుమార్ , పరిశ్రమలు, కార్మిక శాఖ , స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అగ్నిమాపక శాఖ అధికారులతో పరిశ్రమలో అగ్నిమాపక శాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బంది,కంపెనీ ప్రతినిధులు, పోలీసులు ,రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధిత శాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్ ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ... ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు మృతుల వివరాలు మృతుల ఐడెంటిఫికేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా త్వరలో మృతుల కుటుంబాలకు క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహాయ చర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈ .సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్
- చాముండేశ్వరి గురు దత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహణ
- విజేతలకు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరన్ శర్మ, ఎమ్మెల్యే అభినందన

దౌల్తాబాద్, జూలై 04, మనం న్యూస్: చాముండేశ్వరి గురు దత్త పీఠం బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ చరణ్ శర్మ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. శుక్రవారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో గత వారం రోజుల నుండి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో 28 జట్లు పాల్గొనగా శుక్రవారం దుబ్బాక దొమ్మాట టీమ్లు హోరాహోరిగా పోరాడి చివరకు సూపర్ ఓవర్ తో దొమ్మాట జట్టు విన్నర్ గా గెలుపొందింది. రన్నర్ గా దుబ్బా నిలవగా ఇరు జట్లకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలసి చాముండేశ్వరి గురు దత్త పీఠం బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ చరణ్ శర్మ గురూజీ ఆశీస్సులతోటి దొమ్మాట తాజా మాజీ సర్పంచ్ పూజిత వెంకట్ రెడ్డి గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి దొమ్మాట జట్టుకు 20వేల రూపాయలు, రెండో బహుమతిగా దుబ్బాక జట్టుకు పదివేల రూపాయలు బహుమతి షీల్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులకు తగిన ప్రోత్సహం కల్పిస్తామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది క్రీడాకారులు వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారని వారికి తగిన ప్రోత్సాహం లేకపోవడం వలన క్రీడల్లో రాణించలేకపోతున్నారని. గ్రామాల్లో క్రీడలకు పెద్దపీట వేయడానికి తాను తీవ్రంగా కృషి చేశానని. మునుముందు కూడా కృషి చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ హాయంలో క్రీడలకు పెద్దపీట వేసి ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అపరిశుభ్రంగా మారిపోయాయని వాటిని పట్టించుకునేవారు కరువైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలని క్రీడల్లో కూడా జిల్లా. రాష్ట్రస్థాయి. జాతీయస్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. దుబ్బాక నియోజకవర్గంలో క్రీడలకు పెద్దపీట వేసి జిల్లా స్థాయిలో టోర్నీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీ ఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సర్వే గారి యాదవ రెడ్డి మండల కో ఆప్షన్ హమ్మద్ బీ ఆర్ఎస్ సీనియర్ నాయకులు తోట కమలాకర్ రెడ్డి మిడిదొడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ మిడిదొడ్డి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బాల మల్లేశం గౌడ్ మిడిదొడ్డి కో ఆప్షన్ హైమద్ తాజా మాజీ ఉపసర్పంచ్ సింహాచలం జనార్దన్ రెడ్డి సుకురి లింగం ఇప్ప దయాకర్ కనకయ్య షబ్బీర్ తో పాటు బీ ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# హస్తం నిరుపేదల నేస్తం: చిక్కుడు అనిల్ కుమార్



**చిన్న కోడూరు, జూలై 4(మనం న్యూస్):** కాంగ్రెస్ హస్తం నిరుపేదల నేస్తమని ఆ పార్టీ బిసి సెల్ జిల్లా కార్యదర్శి చిక్కుడు అనిల్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి చర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ అంటేనే ధైర్యమని, కాంగ్రెస్ అంటే ప్రజలకు భరోసా అన్నారు. గత ప్రభుత్వాలు పేదలను విస్మరించాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని నిరూపించుకునేందుకు ఖాళీ స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టిస్తుందన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి దశల వారీగా ఇండ్ల నిర్మాణాలను మొదలు పెడుతున్నామన్నారు. బిసిలకు రూ.5 లక్షలు, ఎస్సీ ఎస్టీ లబ్దిదారులకు రూ.6 లక్షలు అందిస్తుంద న్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతుల కోసం ఏక కాలంలో రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమన్నారు. ఉచిత బస్సు మొదలుకొని ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి ప్రజల మనసు చూరగొందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజు, నర్సయ్య, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైపు చూస్తున్న దేశం: పూజల హరికృష్ణ



**సిద్ధిపేట, జూలై 4(మనం ప్రతినిధి):** భారతదేశం మొత్తం కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ అధికారం లోకి తీసుకొచ్చే విధంగా చూస్తున్నారని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సభ విజయవంతం చేసేందుకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి భారీగా వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఏ వర్గానికి ప్రభుత్వాలు న్యాయం చేయకపోవడంతో విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనించి విసుగు చెందుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని ప్రజలు ఆలోచిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొమ్మల యాదగిరి ముద్దం లక్ష్మి గంప మహేందర్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో పరిశీలించినప్పుడే లబ్ధిదారునికి న్యాయం

- రాజంపేట మండలంలో పర్యటించిన కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



**కామారెడ్డి, జూలై 4(మనం జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ రాజంపేట మండలంలో శుక్రవారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరేపల్లి గ్రామంలో రైతులు ప్రవీణ్ మరియు దిలీప్ కుమార్ ల పంట భూములలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న విచారణను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆయా రైతుల భూవిస్తీర్ణంలో తేడాలను సరి చేసేందుకు సమీప భూముల రైతులను కూడా పిలిపించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూభారతి చట్టంలో ఉన్న ముఖ్యమైన అంశాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన అనేది ఒక ముఖ్యమైన అంశమని అన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడే లబ్ధిదారునికి న్యాయం జరుగుతుందని రాజంపేట మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన 1642 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూభారతి చట్టం ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దార్ జానకిని ఆదేశించారు. ఇందిరమ్మ గృహాలను నిర్మించుకునేందుకు ముందుగా ఐకెపి ద్వారా నిరుపేద లబ్ధిదారులకు రుణాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఈ సౌకర్యాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తలమడ్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ సందర్శించి లబ్ధిదారు బోయిన శ్యామల సుధాకర్ దంపతులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, మొరం ఎక్కడినుండి తీసుకొస్తున్నారని, ఎంత విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ వరకు పని పూర్తి ఐనా ఇంకా ఎందుకు తొందరగా పిల్లర్స్, స్లాబ్ వేసుకోవడం లేదని అడిగారు. బేస్మెంట్ వరకు పూర్తయిన పనులకు సోమవారం డబ్బులు ఖాతాలో పడతాయని అన్నారు. వెంటనే పిల్లర్స్, స్లాబ్ పని ప్రారంభించాలని సూచించారు. ఈ గ్రామంలో మంజూరైన అన్ని ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించడం జరిగిందని అలాగే మండలంలో ముగ్గు పోయకుండా పెండింగ్ లో ఉన్న అన్ని ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించాలని హౌసింగ్ ఏఈ రామును ఆదేశించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలకొరకు మండలంలో ఇసుక మరియు మొరం సమస్య లేకుండా చూడాలని తాసిల్దార్ జానకి, ఎంపీడీవో రఘురాం లను ఆదేశించారు. బేస్మెంట్ పూర్తయి చాలా రోజులైనా ఇంకా తర్వాత నిర్మాణాలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించి ఏమన్నా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి ముందుగా ఐకేపీ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం రుణ సౌకర్యాన్ని కల్పించినందున ఈ అవకాశాన్ని ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఉపయోగించాలని ఆదేశించారు. అనంతరం తలమడ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ మరియు మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జడ్పీహెచ్ఎస్ లోని పదవ తరగతి గదిలో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారికి గణిత సమస్యలను పరిష్కరించేందుకు సూచనలు చేశారు. విద్యార్థులతోనే గణిత ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. తర్వాత 9వ తరగతి, 7వ తరగతి గదులలో విద్యార్థుల తో ఇంగ్లీష్ రీడింగ్ చేయించారు. ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్స్ ఇస్తున్నందున విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రతిరోజు యూనిఫామ్ వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థిని ఉట్ల ఉషశ్రీ ఫిజిక్స్ లో చూపిన ప్రతిభకు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సికింద్రాబాద్ రోటరీ క్లబ్ వారు అందజేసిన 30 రీడింగ్ టేబుల్స్ ప్రారంభించారు. అనంతరం ప్రైమరీ స్కూల్ మరియు జడ్పీ స్కూల్ విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ప్లేటు పట్టి భోజనం వడ్డించుకుని వారితో నేలపై కూర్చుని ఆహారం భుజించి రుచి చూశారు. ప్రైమరీ స్కూల్ కిచెన్ షెడ్ సరిగా లేకపోవడంతో 50వేల రూపాయలను మంజూరు చేస్తూ కిచెన్ షెడ్ రిపేర్ చేయించుకోవాలని ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ ను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో జ్యోతి, తాసిల్దార్ జానకి, మండల విద్యాధికారి పూర్ణచందర్, హౌసింగ్ పిడి, జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ బిక్షపతి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు లోతట్టు ప్రాంతాల్లో నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అన్నిశాఖల యంత్రాంగం సమన్వయంతో కలిసి పని చేయాలి
- గత అనుభవాలను దృష్టా మరిన్ని పునరావాస కేంద్రాల ఏర్పాటు
- మున్నేరు లోతట్టు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



ఖమ్మం, జూలై 4(మనం బ్యూరో): మున్నేరు వరదలలో లోతట్టు ప్రాంతాలలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని మున్నేరు లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పర్యటించారు. కాల్వ ఒడ్డు మున్నేరు బ్రిడ్జి, బొక్కలగడ్డ, వినాయక నిమజ్జన ఘాట్ ప్రాంతం, ప్రకాష్ నగర్, జలగంనగర్ తదితర ప్రాంతాలను రాబోయే వరద ప్రభావం విపత్తు నిర్వహణపై ఎస్డీఆర్ఫ్ బృందాలు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని సరిదిద్దాలన్నారు. ఆపద మిత్ర క్రింద యువతి, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు, జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను నియమించినట్లు, ప్రజలకు వారి సేవలు అందించాలని సూచించారు. అధికారులు, ఆపదమిత్ర, ఫిషర్ మెన్, ఈతగాళ్లతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టీసీ బస్సులతో బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పర్యాటకులను ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్ లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్నచోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 1077 నెంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని అన్నారు.

వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి , క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, సహాయ మున్సిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దారు సైదులు, రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎంపీడీవో కుమార్, ఎన్డిఆర్ఎఫ్ బృందం సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి



దమ్మపేట, జూలై 4 (మనం న్యూస్) : దమ్మపేట మండల కేంద్రంలో గల వాసవి భవన్ నందు ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి క్లబ్ గ్రేటర్ దమ్మపేట ఆధ్వర్యంలో కొనేజేటి రోశయ్య జయంతి సందర్భంగా రోశయ్య చిత్ర పటనికి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ దారా యుగంధర్ మరియు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి వెంకట రామారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అంచలంచలుగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మరియు తమిళనాడు కర్ణాటక గవర్నర్ పదవులు నిర్వహించిన వ్యక్తి కొణిజేటి రోశయ్య అన్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రిగా 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాంభద్రం, వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు మండవల్లి సురేష్, సభ్యులు అత్తులూరి సతీష్, దొడ్డ వినోద్ కుమార్,ధార నాగేశ్వరరావు, పరిటాల రాము,పసుమర్తి సాయిరాం,శ్రీను, తదితరులు, పాల్గొన్నారు.

## టిఎల్‌యుడి పద్ధతిలో నాణ్యమైన బయోచారు తయారీ

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం/సుజాత నగర్, 4(మనం న్యూస్) : కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేకంగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బయోచారు యూనిట్ ద్వారా సుజాతనగర్ మండలంలోని మేకలగడ్డ గ్రామంలో బయోచారు తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రయత్నంలో 30 కిలోల వేస్ట్ కట్టెముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి మండించడం ద్వారా 10 కిలోల నాణ్యమైన బయోచారు తయారు చేయగలిగారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలా తయారైన బయోచారును ఆవుపంచకం (ఆవుపేడ మొదలైనవి)తో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచి ఆరబెట్టి, పొడిగా చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించాలని సూచించారు. డివిజన్లోని రైతువేదికల ద్వారా బయోచారు తయారీ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో విరివిగా లభించే సర్కారు బొమ్మ చెట్టు కొమ్మలు, రహదారులు, కరెంట్ తీగలకు అడ్డంగా ఉన్న కొమ్మలను ఉపయోగించి తక్కువ ఆక్సిజన్లో టిఎల్‌యుడి పద్ధతిలో బయోచారు తయారు చేయాలని సూచించారు. అలాగే, స్వయం సహాయక సంఘాలు బయోచారు తయారు చేసి, విక్రయించడం ద్వారా లాభం పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బయోచారు తయారీ సమయంలో ఉత్పన్నమయ్యే వేడిని ఎలా ఉపయోగించుకోవచ్చో, బయోచారు తయారీ విధానాన్ని మరింత తక్కువ ఖర్చుతో, సులభతరంగా రైతులు ఉపయోగించుకునేలా రూపొందించడానికి వివిధ పద్ధతులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఆర్డిఏ పీడీ, ఎంపీడీఓ, సుజాతనగర్ తహసీల్దార్ ఈసి రాజు, ఏడిఏ (టెక్నికల్), వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య, స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపడుదాం

- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సుదర్శన్ రావు




ఖమ్మం, జూలై 4(మనం న్యూస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సభ, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం లో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. సుదర్శన్ రావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం నవాబు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, విస్నూరు దేశముఖ్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన వీరోచిత పోరాటంలో నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నేటి ప్రభుత్వాలు వివిధ రకాల పన్నుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా కొమరయ్య స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్యను స్మరించుకోవడమంటే నాటి ఆంధ్ర మహాసభ ఏర్పాటు, దానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టులు, 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ, వేల గ్రామాలు వెట్టి, దోపిడీ నుండి విముక్తి, 4వేల మంది అమరుల ప్రాణ త్యాగాలు స్మరించుకోవడమే అని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో లిఖించదగిన పోరాటంగా, దేశంలో జరిగిన అనేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చి, దేశంలో భూ సంస్కరణల (భూ పంపిణీ) చట్టం ఏర్పాటుకు, భూ సీలింగ్ చట్టం ఏర్పాటుకు పునాదిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిలిచిందన్నారు. భవిష్యత్తులో వివిధ కార్మిక, వ్యవసాయ చట్టాల మార్పుల ద్వారా కేంద్రం తెరలేపుతున్న దోపిడీకి వ్యతిరేకంగా అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, వై.విక్రమ్, బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, బషీరుద్దీన్, దొంగల తిరుపతిరావు, శీలం నరసింహారావు, మద్దాల ప్రభాకర్, తాళ్లపల్లి కృష్ణ, టి.విష్ణువర్ధన్, పారుపల్లి ఝాన్సీ, పిన్నింటి రమ్య, శీలం సత్యనారాయణ రెడ్డి, చల్లమల విటల్, మాచర్ల గోపాల్, మెరుగు రమణ, వివిధ ప్రజాసంఘాలకు చెందిన బాధ్యులు పాల్గొన్నారు.

## సమృద్ధిగా ఎరువులు ఉన్నాయి



- వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి

దమ్మపేట, జూలై 4 (మనం న్యూస్) : మండలంలో వరి నాట్లు ముమ్మరంగా జరుగుచున్నాయి. ప్రతి సంవత్సరం మనకు సుమారు 12వేల 500 ఎకరాల్లో వరి మండలంలో సాగు అవుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గాను నాచారం,ఆసన్నగూడెం, నాగుపల్లి, మొద్దులగూడెం, గణేష్ పాడు,ఏరియాలో నాట్లు మమరంగా జరుగుతున్నాయి. సుమారు ఇప్పటి వరకు రెండు వేల ఎకరాల్లో నాట్లు పూర్తి కావస్తున్నాయి. దీనికి సంబంధించిన ఎరువులు అందుబాటులో ఉంచడం జరిగింది. దీంట్లో భాగంగా శుక్రవారం నాడు దమ్మపేట, మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలను దమ్మపేట ఏవో చంద్రశేఖర్ రెడ్డి, తనిఖీ నిర్వహించడం జరిగింది. అదేవిధంగా విశాల సహకార సంఘం దమ్మపేట, నందు కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ,యూరియా, అందుబాటులో కలవు మన మండలం మొత్తం ప్రైవేటు దుకాణాలు మరియు సొసైటీ నందు మొత్తం 260 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులు 360 మెట్రిక్ టన్నులు డీఏపీ ఎరువు 170 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది కాబట్టి మన మండలంలో అన్ని పంటలకు ఎరువులు అందుబాటులో ఉంచటానికి జిల్లా అధికారులకు తో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు ఎరువులను అందుబాటులో ఉంచడం జరుగుతుంది. ఏవో చంద్రశేఖర్ రెడ్డి, తెలియజేశారు కావున రైతులు సహకరించి ఎరువులను కొనుగోలు చేయనప్పుడు తప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు చేయవలసిందిగా తెలిపారు.

## బడిబాట పడితే భవిష్యత్తు బాగుంటుంది



- యాచకురాలి కూతురిని బడిబాట పట్టించిన
- ఉపాధ్యాయుడు మాలోత్ భద్రు

మణుగూరు,జూలై 4(మనం న్యూస్) : బడిబాట పడితే భవిష్యత్తు బాగుంటుందని యాచకురాలికి నచ్చ చెప్పి తన కూతురిని ఉపాధ్యాయుడు మాలోత్ భద్రు బడి బాట పట్టించాడు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పూల మార్కెట్ సెంటర్ లో యాచకురాలు తన కూతురిని వెంటబెట్టుకొని భిక్షాటన చేస్తుండగా గమనించిన శివలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పని విధులు నిర్వహిస్తున్న మాలోత్ భద్రు ఆ తల్లితో మాట్లాడాడు. తన కూతురిని ప్రతిరోజు పాఠశాలకు పంపిస్తే అమ్మాయి భవిష్యత్తు బాగుంటుందని చెప్పి తనే స్వయంగా ఆ విద్యార్థిని తన ద్విచక్ర వాహనంపై పాఠశాలకు తీసుకువెళ్లాడు. ఆ విద్యార్థికి కావలసిన వస్తువులు బుక్స్ స్టాల్ కి వెళ్లి స్కూల్ బ్యాగ్, పలక, గొడుగు, పెన్నులు, పెన్సిల్ ఇప్పించి ప్రతి రోజు స్కూల్ కి వచ్చి విద్యా బుద్ధులు నేర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటావని తెలియజేశారు. ప్రభుత్వ స్కూల్లో నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్నం భోజనం ప్రవేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తుందని తెలిపారు. విద్యాబుద్ధులు నేర్చుకునే వయస్సులో స్కూల్ వెళ్లకుండా వివిధ రకాల దుకాణాల్లో పనికి వెళితే వారి వివరాలు తెలియజేయాలన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిబాట పట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంధర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, స్థానికులు, సహచర మిత్రులు, నేతాజీ వాకర్స్ ఆయనను అభినందించారు.

## ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌కు ఐదుగురు యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక



ఖమ్మం, జూలై 4(మనం న్యూస్): ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ కు తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పూల్ డ్రైవ్ లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభను కనబరచారని, జిల్లాలోని అత్యధికంగా 5గురు ఎంపికవ్వడం తమకు గర్వకారణమని కృష్ణ తెలిపారు. గురువారం ఎంపిక పత్రాలను అందుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదాను సాధించిన అనంతరం తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని వారు తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఎంపికల పరీక్షలలో మొదట ఆన్లైన్ టెస్టో 9 మంది ఎంపిక అవ్వగా, చివరి హెచ్. ఆర్. రౌండ్లో 5 గురు అర్హత సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డ్చా జి. ధాత్రి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 6 నెలల పాటు శిక్షణలో భాగంగా 3.60 లక్షల రూపాయలు అందుకుంటారని, తదనంతరం 9 లక్షల పై చిలుకు వార్షిక ఆధాయం పొందుతారని వారు తెలిపారు. 50కు పైగా అభివృద్ధి చెందిన దేశాలలో విస్తరించిన సాఫ్ట్వేర్ సంస్థ ఇన్ఫోసిస్ లో తమ కళాశాల విద్యార్థినులు సిస్టమ్ ఇంజనీర్ గా ఎంపిక అవ్వడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ డ్చా జి. రాజ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో నిర్వహించిన ఎంపికలలో జిల్లాలోనే అగ్రగామిగా నిలవడం పై టాస్క్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. తదనంతర కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, డాక్టర్ జె. రవీంద్రబాబు, డా యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు మహా ఖరీదు

### డిప్యూటేషన్ పై వచ్చిన ఉద్యోగికి డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు?

### ప్రస్తుత డిప్యూటీ వార్డెన్ చార్జి తీసుకొని ఏడాది పూర్తి కాకముందే మరో ఆర్డర్ కాపీ రెడీ

### ఉన్నతాధికారుల సమగ్ర విచారణ అనివార్యం

కారేపల్లి, జూలై 04(మనం న్యూస్): ఖమ్మం జిల్లా పరిధిలోని మేకల తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్ పోస్ట్ కు మహా డిమాండ్ ఏర్పడింది. వార్డెన్ హోదాలో ఉండే హెడ్మాస్టర్ లకు సహాయకులుగా డిప్యూటీ వార్డెన్లను నియమించుకునే అధికారం ఉంటుంది. అన్ని రకాల బాధ్యతలను ఒకరే నిర్వర్తించాలంటే కాస్త పని ఒత్తిడి ఉంటుందేమో అనే ఉద్దేశంతో సహాయకులుగా డిప్యూటీ వార్డెన్ ను నియమించుకునే వెసులుబాటు సంక్షేమ శాఖ కల్పించింది. అది కూడా టీచింగ్ స్టాఫ్ అభిప్రాయాలను తీసుకున్న తర్వాతనే. డిప్యూటీ వార్డెన్ ఎంపిక ప్రక్రియలో భాగంగా కొన్ని సబ్జెక్టులను బోధించే టీచర్లకు మినహాయింపు కూడా ఉంటుంది. ఈ రకంగా జరగాల్సిన ప్రక్రియలో రాజకీయ జోక్యం, ఉన్నతాధికారుల జోక్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఏడాది తిరిగి ఏడాదికి ఒక్కొక్కరుగా మారుతూ ఉండే ఈ ప్రక్రియలో ప్రస్తుత డిప్యూటీ వార్డెన్ ఏడాది కాలం పూర్తికాకముందే, డిప్యూటేషన్ పై వచ్చిన మరో ఉద్యోగిని డిప్యూటీ వార్డెన్ గా తీసుకోవాలనే ఆదేశాలతో హెడ్మాస్టర్ టేబుల్ పై ఆర్డర్ కాపీ ప్రత్యక్షమైంది. ఎంతో డిమాండ్ ఉన్న పోస్ట్ కావడం, డిప్యూటీ వార్డెన్ పై ప్రత్యేకమైన ప్రీతి ఉంటే గాని ఇలా హడావుడిగా ఆర్డర్లు జారీ చేయబడవు. డిప్యూటేషన్ పై వచ్చే టీచర్లకు డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు ఇవ్వకూడదు అనే స్పష్టమైన నిబంధనను అమలు చేయాల్సిన అధికారులే నిబంధనలను నీరుగార్చడం, దీనికి హెడ్మాస్టర్ మద్దతుగా నిలవడం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. ఇదే మేకల తండా హాస్టల్ లో పనిచేసి వార్తల్లో హాట్ టాపిక్‌గా నిలిచి, డిప్యూటీ వార్డెన్ల సొంత ఇళ్లల్లో బియ్యం నిల్వలను పట్టుకున్న సందర్భాలు బోలెడున్నాయి. ఈ హాస్టల్లో డిప్యూటీ వార్డెన్‌గా పనిచేయాలనే ఆశ బలంగా ఉండడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, రాజకీయ నాయకుల ప్రమేయం, రకరకాల రికమండేషన్ ల కారణంగా డిప్యూటీ వార్డెన్ ఎంపిక ప్రక్రియ సజావుగా జరగడం లేదు. హాస్టల్ పరిధిలోనే హెడ్మాస్టర్ నిర్ణయం ఆధారంగా జరగాల్సిన ప్రక్రియ నిర్ణయాత్మకంగా జరగడం లేదు. రికమండేషన్ ప్రభావంతో ఆగ మేఘాలపై ఆర్డర్ కాపీలు పుట్టుకొస్తున్నాయి. అనాలోచిత నిర్ణయాలు, ప్రక్రియ పట్ల ఉన్నత అధికారుల నిర్లక్ష్యం, విద్యార్థుల జీవితాలపై ప్రభావం చూపుతోంది. అనాలోచిత ఆర్డర్ కాపీలు పేద పిల్లల కడుపులు కొడుతున్నాయి. పేద పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వాలు పరితపిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల లోపం కారణంగా డిప్యూటీ వార్డెన్ పోస్టు కేవలం ఆదాయ మార్గంగా మారిపోయింది. అందరినీ మేనేజ్ చేసుకుంటూ హాయిగా పని ముగించుకోవచ్చు అనే ఆలోచన, డిప్యూటీ వార్డెన్లకు ధైర్యంగా మారింది. అదే ధైర్యం డిప్యూటీ వార్డెన్ పోస్ట్ పట్ల మమకారాన్ని పెంచుతున్నది. ఆడపిల్లలు చదువుకునే ఈ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులు, మగ పిల్లల మాదిరిగా గట్టిగా అడగరనే నమ్మకం కూడా కావచ్చు. మేనేజ్ చేసుకుంటూ పని ముగించుకోవచ్చు అనే ఆలోచన కూడా కావొచ్చు.

**మీకెందుకు చెప్పాలి:**



గతంలో ఇదే హాస్టల్‌లో డిప్యూటీ వార్డెన్ గా పనిచేసిన ఓ ఉద్యోగి ఇంట్లో నిల్వ చేసిన బియ్యం పట్టుకున్న పోలీసులు

డిప్యూటీ వార్డెన్ ను నియమించే క్రమంలో ఆచితూచి, పూర్వపరాలను పరిశీలించి, నిర్ణయాలు తీసుకోవాలి. డిప్యూటీ వార్డెన్ బాధ్యతలను బదలాయించే క్రమంలో హెడ్మాస్టర్ తో శుక్రవారం 'మనం న్యూస్' ప్రతినిధి ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేయగా హెడ్మాస్టర్ వెంకటరమణ నిర్లక్ష్యంగా బదులిచ్చారు. నాలుగుసార్లు ఫోన్ చేసిన ఫోన్ ఆన్సర్ చేయలేదు. మరోసారి ఫోన్ చేసి వివరణ తీసుకునే ప్రయత్నం చేయగా అసలు మీకెందుకు చెప్పాలి? అంటూ దురుసుగా మాట్లాడారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి:**

గిరిజన ఆడపిల్లలు చదువుకుంటున్న ఈ మేకల తండా ఆశ్రమ పాఠశాల పై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఒక అవగాహన ఉన్నా కూడా కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో చూసి చూడనట్టు వ్యవహరించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరైన మెనూ పాటించకపోతే ఆడపిల్లల్లో పౌష్టికాహార లోపం ఏర్పడి, పేద ఆడపిల్లల ఆరోగ్యంపై, చదువుపై, అంతిమంగా వారి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపిస్తే, క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరిగి, ఆహార మెనూ షెడ్యూల్ ప్రకారం అమలు జరగకపోతే గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యాలు నెరవేరకపోవచ్చు. ఆగ మేఘాలపై వచ్చిన ఆర్డర్ కాపీపై మరొక్కసారి ఉన్నతాధికారులు విచారణ చేసి, క్షేత్రస్థాయిలో విద్యార్థులతో, మహిళ స్టాఫ్ తో కూడా మాట్లాడి డిప్యూటీ వార్డెన్ నియామకంపై నిర్ణయం తీసుకుంటేనే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ కలలు నెరవేరుతాయి.

# హత్య యత్నం కేసులో ముగురికి 5సంవత్సరాల కఠినకారాగార శిక్ష

- నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరు
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల జూలై 5( మనం ప్రతినిధి) :** జిల్లాలోని పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య యత్నం కేసులో జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ శుక్రవారం కీలక తీర్పును వెలువరించారు. ఈ కేసులో మొత్తం ముగ్గురు నిందితులకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు వివరాళ్ళోకి వెళ్తే

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, 16-8-2019న ఉదయం 09:00 గంటలకు పిర్యాదిదారుడు తన తల్లి, అన్నయ్య, మేనల్లుడుతో కలిసి కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పనికి హాజరవుతున్నారు. ఆ సమయంలో ఆయన కాపలాదారులు తోట అనిల్ నారాయణ (32 సంవత్సరాలు) మరియు ఆయన అన్నయ్య తోట మారుతి నారాయణ (35 సంవత్సరాలు),ఆయన భార్య తోట జ్యోతి ఎం.కాపు, అందరూ రాములపల్లి (5) వంశస్థులు. వీరందరూ తమ వ్యవసాయ భూముల వివాదాలను దృష్టిలో ఉంచుకుని, అలాంటి శత్రుత్వంతో, కౌబార్, గొడ్డలి వంటి ప్రాణాంతక ఆయుధాలను పట్టుకుని అక్కడికి వచ్చి వారిపై దాడి చేశారు. మొదట వారు అతని అన్నయ్య తలపై కౌ క్రతో కొట్టారు మరియు అతనిని చంపాలనే ఉద్దేశ్యంతో కడుపులో ఎడమ వైపున కూడా పొడిచారు, దీని కారణంగా అతని అన్నయ్య కిందపడి స్ప ృహ కోల్పోయాడు. తరువాత వారు అతని తల్లి తలపై కౌ క్రతో కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. అతని అన్నయ్య మరియు తల్లిని చూసి, అతను భయపడి అక్కడి నుండి తప్పించుకుని కడారి జనార్ధన్ ఇంటి వెనుక ఉన్న గడ్డి కుప్పలో దాక్కున్నాడు. వారు కూడా అతన్ని చంపడానికి మారణాయుధాలతో అతనిని వెంబడించి సమీపించారు, మరియు అతను వారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పుడు, వారు అతని మెడ మరియు తలపై కౌ క్రతో కొట్టారు. తరువాత అతను ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇస్తానని బిగ్గరగా అరుస్తూ జనార్ధన్ ఇంటి లోపలికి పరుగెత్తాడు మరియు లోపలి నుండి తలుపులు మూసుకున్నాడు. పోలీసులు వస్తారనే భయంతో, నిందితులు అక్కడి నుండి పారిపోయారు. తోట అనిల్, తోట మారుతి, తోట జ్యోతి లపై అవసరమైన చర్యలు తీసుకోవాలని తోట మహేందర్ పిర్యాదు ఇవ్వగా. ఆ ఫిర్యాదుపై, అప్పటి ఎస్ ఐ. బిల్లు బి జీవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి .నిందితులను అరెస్ట్ చేసి కోర్టు లో ప్రవేశ పెట్టడం జరిగింది. సాక్షులను విచారించిన గౌరవ జడ్జి గారు నేరస్థులు ఏ1 నుండి ఏ3 వరకు ఉన్న నిందితులకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి రూ. 1500/- చొప్పున జరిమానా విధించడం జరిగింది.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని, చేసిన నేరానికి శిక్షలు తప్పవని అందరూ గమనించాలని ఎస్పి సూచించారు. ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించి, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. మల్లికార్జున్ ,దర్యాప్తు అధికారులు అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.జీవన్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సి ఎం ఎస్ ఎస్.ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ కెవి.సాగర్ , కానిస్టేబుల్ త్రివేణ్, కిరణ్ కుమార్, లను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# కోనేరు రంగారావు సిఫారసులను అమలు చేయాలి

- ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి..



**నూగురు/వెంకటాపురం, జూలై 4(మనం న్యూస్) :** షెడ్యూల్ ఏరియాలోని భూ వివాదాల్లో ఆదివాసీల పైన పోలీస్ కేసులు పెట్టొద్దని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి వెంకటాపురం ఎస్స్ర కొప్పుల తిరుపతి రావు ను తన కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కోనేరు రంగారావు సిఫారసుల ప్రకారం డీజిపి కార్యాలయం విడుదల చేసిన కాపీ కూడా మెమోరాండం కు జత చేయడం జరిగిందని నర్సింహా మూర్తి అన్నారు. షెడ్యూల్ ఏరియాలో 1/70, పేసా వంటి రాజ్యాంగ బద్ధమైన చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా పట్టాలు చేసుకొని కొంతమంది గిరిజనేతరులు అమాయకులు అయిన ఆదివాసీల భూములను కాజేయాలనీ ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. గిరిజనేతరులు పట్టాలు కలిగి ఉన్నంత మాత్రాన వారికీ హక్కులు లభించవని, అవి చట్ట పరిధిలో ఉన్నాయా లేవా అనేది స్పెసల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టు నిర్ణయిస్తుందని మెమోరాండం లో పేర్కొన్నట్లు తెలియజేసారు. రాజకీయ, ఆర్థిక బలం కలిగిన వలస గిరిజనేతరులు విద్యలేని అమాయక ఆదివాసీల పైన తప్పుడు కేసులు పెట్టి పోలీస్ లను సైతం తప్పు త్రోవ పట్టించాలని చూస్తున్నట్లు ఎస్స్ర కొప్పుల తిరుపతి రావు దృష్టికి తీసుకెళ్లారు. గిర్లాని, కోనేరు రంగారావు రికమెండేషన్స్ ప్రకారం 8.70 వేల ఎకరాల గిరిజనుల సాగు భూమి అన్యాక్రాంతం అయినట్టు కమిషన్ నివేదిక ఇచ్చిందని అన్నారు. సివిల్ వివాదాల్లో ఆదివాసీల పైన ఎలాంటి కేసులు పెట్టరాదని ఎస్స్ర కొప్పుల తిరుతి రావు ని కోరినట్టు తెలిపారు. భూ వివాదాలల్లో ట్రెస్ పాస్ కేసులు కూడా గిరిజనుల పైన పెట్టకూడదు అని భద్రాచలం ఐటీడీ ఏ ప్రాజెక్ట్ అధికారి విపి గౌతమ్ ఐ ఏ ఎస్ ప్రత్యేక సరక్యులర్ జారీ చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్పీ కార్యాలయాలనికి పంపినట్టు తెలిపారు. ఏవైనా సివిల్ వివాదాలు వస్తే మండల మెజిస్ట్రేట్ దెగ్గరకు వెళ్లాలని ప్రజలకు చూసించాలని నర్సింహా మూర్తి కోరినారు. అనంతరం ఆయన వెంకటాపురం ప్రభుత్వ విశ్రాంతి భవనం యందు రైతుల తో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ అంకన్న గూడెం ఆదివాసీ రైతుల పైన ప్రతిసారి వలస గిరిజనేతరుడు తప్పుడు కేసులు పెట్టి వేడిస్తున్నాడని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఏనాడైనా పార, పలుగు పట్టి పని చేయని వలస గిరిజనేతరుడు పదుల సంఖ్యలో ప్రభుత్వ భూములను కాజేసినట్టు ఆదివాసీలు ఆరోపిస్తున్నారని అన్నారు. రెవిన్యూ అధికారులు చట్ట విరుద్ధంగా వలస గిరిజనేతరులకు పట్టాలు చేస్తూ ఉన్నారని మండిపడ్డారు. గిరిజన గిరిజనేతరుల మధ్య ఉత్పన్నం అయ్యే భూ సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని తహసీల్దార్ వేణుగోపాల్ ని కోరారు. కార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్, అంకన్న గూడెం రైతులు మిడెం లక్ష్మయ్య, బొగ్గుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నివారణే లక్ష్యంగా పోలీసులు పని చేయాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**ఇబ్రహీంపట్నం, జూలై 4 (మనం న్యూస్) :** వార్షిక తనిఖీ లో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పి శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని అన్నారు. నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందును అధికారులు,సిబ్బంది సన్నద్ధంగా ఉండాలి పకడ్బంది గా పని చేయాలన్నారు. గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు రోజులో కురిసే వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ. పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ యొక్క కార్యక్రమంలో డిఎస్పి రాములు , మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ , ఇబ్రహీంపట్నం ఎస్.ఐ అనిల్, ఎస్.ఐ లు శ్రీకాంత్, రాజు, నవీన్ రాజు నాయక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రోశయ్య చిత్రపటానికి నివాళ్లర్పించిన ఎస్పీ




**జగిత్యాల, జూలై 4 (మనం ప్రతినిధి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కె. రోశయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా,ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఆయన సేవలను స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారని తెలిపారు. ఆయన ప్రజాసేవా నిబద్ధత, పరిపాలనలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ సిబ్బంది ఆయన జీవితం నుండి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్ స్పెక్టర్‌లు కిరణ్ కుమార్,వేణు, ఐటీ కోర్ ఇన్ స్పెక్టర్ రఫీక్ ఖాన్, ఫింగర్ ప్రింట్ ఇన్ స్పెక్టర్ శ్రీధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వార్షిక ప్రణాళిక సాధనకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలి

- వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- పాఠశాల వివరాలను ఎప్పటికప్పుడు యూ.డి.ఐ.ఎస్.ఈ లో అప్ డేట్ చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 04 (మనం ప్రతినిధి) :** ప్రతి పాఠశాల తమ వార్షిక ప్రణాళిక సాధనకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఓదెల మండలంలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ పై హెడ్ మాస్టర్ లతో పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,ప్రతి హెడ్ మాస్టర్ పాఠశాలలో చదివే పిల్లలు విద్యా సంవత్సరం ముగిసే నాటికి కనీస విద్యా ప్రమాణాలు కలిగి ఉండేలా చూడాలని అన్నారు. మ్యాథ్స్ డివిజన్ 60 శాతం, ఆంగ్లం రాయడం, చదవడం తెలుగు చదవడం వంటి విద్యా ప్రమాణాల సాధనకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మన పాఠశాలలో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగితే ఆటోమేటిక్ గా పాఠశాలల పట్ల ప్రజలలో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఓదెల మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఫేషియల్ రికగ్నైంట్ సిస్టం ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని అన్నారు. మండలంలోని పాఠశాలలో టీచర్లు సమయపాలన పాటించాలని అన్నారు. టీచర్లకు సెలవులు మంజూరు విషయంలో నిబంధనలు పాటించాలని, ఒకేసారి టీచర్లు అంతా సెలవులు పెట్టకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు బోధన ఎలా ఉంటుంది, విద్యా ప్రమాణాలు పెంచడానికి ఇంకా ఏ చర్యలు తీసుకోవాలి ఇలాంటి అంశాల పై రివ్యూ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు సంయుక్తంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు వర్క్ బుక్స్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ షెడ్యూల్ ప్రకారం జరగాలని తప్పనిసరిగా 60 శాతం తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి
- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక చర్యలు
- విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించిన కలెక్టర్
- ఎంజేపీ బీసీ బాలుర, బాలికల సాంఘీక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ కలెక్టర్ తనిఖీ



**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, జూలై 04 (మనం న్యూస్) :** గురుకుల విద్యా సంస్థల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తెలకపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర, బాలికల సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలను శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గురుకులాల్లో కల్పిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల హాజరు, భోజన సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ నేరుగా ఆరా తీశారు. బియ్యాన్ని, సరఫరా స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వండే బియ్యాన్ని ఒకరోజు ముందే శుభ్రం చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని, తాజా కూరగాయలనే వినియోగించాలని వంట మనుషులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా కలెక్టర్ ముచ్చటించి, భవిష్యత్లో ఏం కావాలనుకుంటున్నారని, ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను

పరిశీలించాలన్నారు. సబ్జెక్టుల్లో వారీగా ప్రశ్నలను అడిగి విద్యార్థులతో సమాధానాలు రాబట్టారు. గురుకులాల్లో ఏ వైనా సమస్యలుంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్లను ఆదేశించారు. పాఠశాలలో చదువులు, వసతులు, సమస్యలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలం అయినందున విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలకుండా సరైన శానిటేషన్ పాటించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడేలా అవకాశం కల్పించి, కొత్తగా ఏర్పాటు చేసిన టెలిఫోన్ సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఏ సమయంలో ఫోన్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం 10 తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ సంవత్సరం కూడా వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ప్రిన్సిపల్ ఏఆర్ లక్ష్మికి సూచించారు. డ్రైనేజీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. గురుకులంలో అవసరమైన మూత్రశాలల నిర్మాణ పనులు చేయించుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.

## ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, జులై 04 (మనం న్యూస్) :** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం గాంధీభవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఖర్గేకు నమస్కరించి అభివాదం తెలిపారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలపై ఖర్గేతో చర్చించినట్లు తెలిసింది.

## మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం : జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల జూలై 4 (మనం ప్రతినిధి) :** మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన కొణిజెటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కొణిజెటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత.బీసీ సంక్షేమ అధికారి జి సునీత , జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి రవి, పి డి డి ఆర్ డిఏ రఘువరన్ఇతర మరియు జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, తదితరులుపాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మికతనికి చేసిన జాయింట్ కలెక్టర్

**నాగార్జునసాగర్, జులై 4 మనం న్యూస్ :** నాగార్జునసాగర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ అమిత్ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరు శాతాన్ని, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు, ఆ తర్వాత పాఠశాలకు కావలసిన మరుగుదొడ్ల సదుపాయాలు, నీరు విద్యుత్ సరఫరా, పెయింటింగ్ కు సంబంధించి



అవసరాలు ఏవైనా ఉంటే తెలపాలని వాటిని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అన్నారు. అందుకు ప్రిన్సిపాల్రవికుమార్ స్పందిస్తూ ప్రస్తుతానికి పాఠశాలకు అన్నీ సౌకర్యాలు సక్రమంగానే ఉన్నట్లు తన అభిప్రాయాన్ని జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంట ఎంఈఓ తరి రాము, కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, ఆర్ ఐ దండ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కళాశాల ఏ. టీ. పి, లు ఉపాధ్యాయులు ఉన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



**మహబూబ్ నగర్, 04జూలై, (మనం బ్యూరో) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని, తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి,వర్ధంతి వేడుకలను జరిపారు. రోశయ్య,దొడ్డి కొమురయ్య చిత్రపటాలకు స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు..జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్,జిల్లా సహకార అధికారి శంకరా చారి,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి.శ్రీనివాస్,జిల్లా గృహ నిర్మాణ శాఖ పి.డి.వైద్యం భాస్కర్,కలెక్టరేట్ ఏ. ఓ సువర్ణ రాజ్ ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాలు కొరత రాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలి

- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, జూలై 04 ( మనం ప్రతినిధి ):** ఎరువులు, విత్తనాలు కొరత రాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని, కల్తీ విత్తనాలు అమ్మకం, ఫెర్టిలైజర్స్ అధిక ధరలకు అమ్మే షాపులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో ఎరువులు విత్తనాల, సరఫరా, కల్తీ విత్తనాలు, మందుల అక్రమ అమ్మకం జరుగకుండా తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., ఈ వానాకాలం పంట సీజన్ లో రైతులకు పంపిణీ చేసేందుకు ఇప్పటికే జిల్లాకు 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, దాంతో పాటుగా మరో 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఇప్పటికే ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని రైతులకు సొసైటీల ద్వారా అందించగా మరో 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉందని అయినా యూరియా కొరతతో రైతులకు ఇబ్బంది పడుతున్నారనే సమాచారం రైతులను గందరగోళానికి గురి చేస్తుందని వ్యవసాయ అధికారులు మండలాల వారీగా రైతులకు అవసరమైన మేర అందుబాటులో ఉన్న యూరియాను ఉపయోగించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. యూరియా అందుబాటులో ఉన్నదని సమాచారం రైతులకు అందించాలని అన్నారు.

అలాగే గత సంవత్సరం ఈ సమయంలో ఎంత యూరియా రైతులకు అందించాము. ఇప్పుడు ఎంత అందించాము ఇంకా ఎంత అవసరం ఉంటదో నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు తరచు ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసి పురుగుల మందులు మరియు విత్తనాలను అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిర్దేశిత ధరకంటే అధిక ధరలకు విక్రయించే షాపులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాకు నిర్దేశించిన 2500 ఎకరాలలో పామాయిల్ తోటల పెంపకానికి వేగంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మరియు ఉద్యానవన అధికారులను ఆదేశించారు.

సంవత్సరం పొడవునా పంట దిగుబడి వస్తూ రైతులకు అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకం పై అవగాహన కల్పించి 5 ఎకరాలకు పైన భూమిని కలిగి ఉన్న రైతులను మోటివేట్ చేసి ప్రతి మండలానికి 200 ఎకరాలను టార్గెట్ గా నిర్దేశించుకుని ఆయిల్ ఫామ్ తోటల పెంపకం లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ విక్టర్, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, ఏసీపి నర్సింహారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, ఏడీఏలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



**నిజామాబాద్, జూలై 04 ( మనం బ్యూరో ):** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఇతర అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, బీసీ కుల సంఘాల నాయకులు వర్ధంతి వేడుకలో పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిసలై, భవిష్యత్తును పాడుచేసుకోవద్దు

- **నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్ స్పెక్టర్ స్వప్న**




**నిజామాబాద్, జూలై 04 ( మనం బ్యూరో ):** యువత మత్తు పదార్థాలకు బానిసలై, భవిష్యత్తు పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాల రహిత సమాజంగా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ స్వప్న తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆటో నగర్ లోని డ్రైవర్స్ కాలనీలో మాదక ద్రవ్యాలు వినియోగ వల్ల కలిగే అనారోగ్య ప్రభావాలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ముఖ్యంగా 13 నుంచి 20 సంవత్సరాల వయసులోనే యువకులే మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల కదలికపై ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నవారే ఎక్కువగా గంజాయి లాంటి డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు నిద్ర పోరు.. ఒంటరిగా ఉండటం.. అందరిలో కలగకపోవడం.. ఫోన్ ఎక్కువగా వాడటం.. పెదవులు తడారడం లాంటివి లక్షణాలు ఉంటాయని సూచించారు. యువకులను ఎన్ని సార్లు పట్టుకున్నా మారడం లేదని, తల్లిదండ్రులు సరిగ్గా లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందన్నారు. ముఖ్యంగా నాందేడ్, పర్బనీ లాంటి ప్రాంతాలకు ట్రైన్ లలో వెల్లి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.

## బీసీల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తాం

- **బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్**



**నిజామాబాద్, జూలై 04 ( మనం బ్యూరో ):** బీసీల హక్కుల కోసం మున్ముందు పోరాటాలు ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడిగా కొట్టూరు చంద్రకాంత్ మేరును నియమించారు. అనంతరం ఆయనను సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ., జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా బీసీలు బలపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర నూతన అధ్యక్షుడిగా నియమితులైన చంద్రకాంత్ మేరు నగరంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తారని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సంఘం తరపున బీసీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం గంగ కిషన్ మేరు, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కరిపె రవిందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, అజయ్, చంద్రమోహన్, విజయ్, సాయి బసవ, చంద్రకాంత్, విజయ, సదానంద్, హన్మంత్ రావు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివి



**కామారెడ్డి, జూలై 04 ( మనం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత రోశయ్య జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., 2009 నుండి 2010 సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తదనంతరం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్ గా పనిచేయడమే కాకుండా చాలా పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పనిచేసి తన రాజకీయ అనుభవంతో ప్రజలకు విశేష సేవ చేశారని ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చందర్ నాయక్, విక్టర్, రవికుమార్, టిజిఓ సెక్రటరీ సాయి రెడ్డి, టిఎన్జీవో అధ్యక్షులు వెంకట్ రెడ్డి, సభ్యులు, జిల్లా అధికారులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కలెక్టరేట్ ఏవో సయ్యద్ మసూద్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ సీజ్ చేసిన ఎంఈఓ

- **నోటీసులు జారీ చేసినా పట్టించుకోని యాజమాన్యం**
- **అనుమతులు వచ్చే వరకు తరగతులు నిర్వహించవద్దని హెచ్చరిక**




**కామారెడ్డి, జూలై 04 ( మనంప్రతినిధి):** శ్రీ చైతన్య పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని ఎంఈఓ నోటీసులు జారీ చేసి ఒక్కరోజు కాలేదు. అయినా ఆ నోటీసులు మా పాఠశాలకు కాదన్నట్టుగా, అధికారులు ఇచ్చిన నోటీసులు కూడా భేఖాతారు చేస్తూ తరగతులు నిర్వహించడం గమనార్హం. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాలను ఎలాంటి అనుమతులు లేవని గురువారం నోటీసులు అందించారు. అయినా కూడా పాఠశాల తీరు మార్చుకోకుండా యధావిధిగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం మండల విద్యాధికారి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం పాఠశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సూచనల మేరకు విద్యాశాఖ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను మూసివేసినట్లు తెలిపారు. తదుపరి అనుమతులు వచ్చే వరకు పాఠశాలలో తరగతులు నిర్వహించవద్దని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. విద్యాశాఖ అనుమతులు వచ్చేవరకు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించవద్దని సూచించారు. అనుమతి లేని పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడుతాయని హెచ్చరించారు. కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రుల పాఠశాలల అనుమతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## 'రోజూ రూ.1.25లక్షల ఆదాయం'
### ఆ వీడియో నిజం కాదు: కేంద్రం క్లారిటీ




**ఢిల్లీ, జూలై 4:** ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల పేరుతో సైబర్ మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. అచ్చంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్టుగా డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి అమాయకులను దోచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. సదరు వీడియో కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయాలని పేర్కొంటూ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో ఈ తరహా వీడియోలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేవలం రూ.21 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజూ రూ.1.25 లక్షల ఆదాయం పొందేలా ఓ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ను ప్రధాని మోడీ ప్రమోట్ చేస్తున్నట్లుగా ప్రసారం అవుతున్న వీడియోలు నకిలీవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ఈ వీడియోలు డిజిటల్‌గా మానిప్యులేట్ చేసినవని పీఐబీ స్పష్టం చేసింది. ఇలాంటి పెట్టుబడి స్కీమ్ ఏదీ ప్రధాని నరేంద్ర మోడీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ప్రవేశపెట్టలేదని తెలిపింది. ఏ వేదికతోనూ వారికి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ తరహా డీప్‌ఫేక్ వీడియోల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురికావొద్దని విజ్ఞప్తి చేసింది.

# చైనాలో మూడో సంతానానికి రూ.12లక్షలు!

**బీజింగ్, జూలై 4:** జనాభా సంక్షోభాన్ని అధిగమించేందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్న చైనా మరో భారీ నగదు ప్రోత్సాహక కార్యక్రమాన్ని త్వరలో అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి పుట్టిన ఒక్కో బిడ్డకు ఏడాదికి రూ.42 వేలు ఇవ్వాలని, చిన్నారికి మూడేళ్లు వచ్చేవరకు దీన్ని కొనసాగించే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, చైనాలోని హోహోట్, టియాన్మెన్ వంటి నగరాల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ సంతానం ఉన్న కుటుంబాలకు రూ.లక్షల నగదు, ఇతర ప్రోత్సాహకాలు అందించే పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. ఒకే బిడ్డ విధానాన్ని అనేక దశాబ్దాల పాటు అమలు చేసిన చైనా.. 2016 జనవరి 1తో దానికి స్వస్తి పలికింది. అయినప్పటికీ పిల్లల్ని కనేందుకు చైనీయులు ముందుకు రావడం లేదట. దీంతో అక్కడ సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గుతోంది. వివాహాల రేట్లు కూడా రికార్డు స్థాయిలో పడిపోవడంతో రానున్న రోజుల్లోనూ జనాభా సంఖ్య పెరగడం కష్టంగానే కనిపిస్తోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న చైనా ప్రభుత్వం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అనేక చర్యలు చేపడుతోంది.

**మూడో బిడ్డకు రూ.12 లక్షలు..**

సంతానోత్పత్తిపై దృష్టిపెట్టిన చైనాలోని పలు స్థానిక ప్రభుత్వాలు.. దంపతులకు నగదు, గృహ వసతి వంటి అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇన్నర్ మంగోలియాలోని హోహోట్ నగరం.. తొలి సంతానానికి 10 వేల యువాన్ల నగదు ఇచ్చే పథకాన్ని అమలు చేస్తోంది. రెండో బిడ్డకు 50 వేల యువాన్లు (ఏడాదికి పదివేల చొప్పున ఐదేళ్లు), మూడో బిడ్డకు లక్ష యువాన్లు (ఏడాదికి పదివేల చొప్పున పదేళ్లు) నగదు అందిస్తోంది. అదనంగా మెడికల్ ఇన్సూరెన్స్, ఫ్రీ హెల్త్ చెకప్‌తోపాటు ఏడాదిపాటు ఉచితంగా ఓ కప్పు పాలు కూడా అందించే కార్యక్రమాన్ని ఈ ఏడాది మార్చి 1 నుంచి అమలు చేస్తోంది.

**నగదుతోపాటు గృహ సబ్సిడీ..**

సెంట్రల్ చైనాలోని టియాన్మెన్ కూడా ఎక్కువ మంది బిడ్డల్ని కనే దంపతులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. రెండో బిడ్డకు జన్మనిచ్చే తల్లులకు 6500 యువాన్లు అందించడంతోపాటు చిన్నారి మూడేళ్లు వచ్చే వరకు నెలకు 800 యువాన్లను ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అదే మూడో బిడ్డ పుడితే నెలకు వెయ్యి యువాన్లు అందిస్తోంది. వీటితోపాటు గృహవసతి కోసం 18 వేల యువాన్ల సబ్సిడీ, ఉచిత హెల్త్ చెకప్ల వంటి అనేక ప్రయోజనాలను చేకూరుస్తోంది. ఇలా ప్రభుత్వ పథకాల ప్రభావంతో అక్కడ గతేడాదిలో జననాల రేటు 17శాతం పెరిగినట్లు అధికారిక నివేదికలు వెల్లడించాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చాలా ఏళ్లపాటు కొనసాగిన చైనా ఇటీవల రెండో స్థానానికి చేరుకుంది. జనాభా ఏటా క్షీణిస్తుండటమే అందుకు కారణం. జనాభా పెరుగుదలకు అనేక ప్రోత్సాహకాలు అమలు చేస్తున్నప్పటికీ కొన్నేళ్లుగా ఈ సంఖ్య తగ్గుతూనే ఉంది. 2016లో జననాల సంఖ్య 1.8 కోట్లుగా ఉండగా.. గతేడాది ఇది 95 లక్షలకు పడిపోయింది. ఇలాగే కొనసాగితే చైనా జనాభా 2050 నాటికి 130 కోట్లు.. 2100 నాటికి 80 కోట్లకు పడిపోతుందని ఐరాస నివేదికలు అంచనా వేస్తున్నాయి.



## ఆపరేషన్ సిందూర్ మా నిబద్ధతకు నిదర్శనం

- **కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా**



**పుణె, జూలై 4:** దేశ సార్వభౌమాధికార రక్షణకు ప్రభుత్వం, సాయుధ దళాలు ఎంత నిబద్ధతతో ఉన్నాయో చెప్పేందుకు ఆపరేషన్ సిందూర్ అద్భుతమైన ఉదాహరణ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ "పీష్వా బాజీరావు స్మారకానికి ఎన్డీఏనే అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడే మన సైనిక నాయకత్వం శిక్షణ పొందుతోంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని తొమ్మిది టెర్రరిస్టు క్యాంపులపై భారత్ విరుచుకుపడి ధ్వంసం చేసింది. అనంతరం ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోని కీలక సైనిక స్థావరాలను భారత్ నాశనం చేసిన విషయం తెలిసిందే.

## ఆర్థిక వివరాలిస్తేనే పరిహారమా?

- **విమాన ప్రమాద బాధిత కుటుంబాల ఆవేదన..!**



**అహ్మదాబాద్, జూలై 4:** గత నెల యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన విమాన దుర్ఘటనలో బాధిత కుటుంబాలకు ఎయిరిండియా తాత్కాలిక పరిహారం అందజేస్తోంది. అయితే, ఈ పరిహారం కోసం ఆర్థిక వివరాలు చెప్పాలంటూ తమను బలవంతపెడుతున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఎయిరిండియా స్పందించింది. అసలేం జరిగిందంటే..? విమాన ప్రమాదంలో పరిహారం అందాలంటే మృతుల కుటుంబాలు కొన్ని ఆర్థిక వివరాలను బహిర్గతం చేయాలంటూ ఎయిరిండియా ఒత్తిడి చేస్తోందని బ్రిటన్‌కు చెందిన న్యాయ సంస్థ స్టీవర్ట్స్ ఆరోపించింది. ఈ కంపెనీ 40 బాధిత కుటుంబాల తరఫున పరిహార చెల్లింపు ప్రక్రియపై పనిచేస్తోంది. 'మా క్లయింట్లకు ఎయిరిండియా ఓ ప్రశ్నావళిని పంపించింది. అందులో వ్యక్తిగత వివరాలతో పాటు ఆర్థిక సమాచారానికి సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తిపై దరఖాస్తుదారులు ఆర్థికంగా ఆధారపడి ఉన్నారా? లేదా అని ప్రశ్నించింది. దాన్ని చూసి మేం షాక్ అయ్యాం. దీనిపై అప్పీల్ చేశాం' అని స్టీవర్ట్స్ కంపెనీ ఆరోపణలు చేసింది. ఆ వివరాలు ఇవ్వకపోతే చెల్లింపులు రావని ఆ సంస్థ పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై ఎయిరిండియా స్పందిస్తూ ఆరోపణలను ఖండించింది. 'ఇవన్నీ నిరాధారం, అవాస్తవ కథనాలు. మృతులతో దరఖాస్తుదారులకు ఉన్న బంధాన్ని తెలుసుకునేందుకే మేం ఆ ప్రశ్నావళిని పంపించాం. అప్పుడే తాత్కాలిక చెల్లింపులను సరిగ్గా చేయగలం. ఇలాంటి విషయాల్లో కొన్ని విధి విధానాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇందుకోసం బాధిత కుటుంబాలకు మేం కావాల్సినంత సమయం ఇస్తున్నాం. వారికి అన్నివిధాలా అండగా ఉండాలనే మేం కోరుకుంటున్నాం' అని ఎయిరిండియా ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటివరకు 47 కుటుంబాలకు తాత్కాలిక చెల్లింపులు చేసినట్లు ఎయిర్‌లైన్ తెలిపింది.జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒక్క ప్రయాణికుడు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. విమాన ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు కాగా.. 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు టాటాసన్స్ రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించింది. దీంతోపాటు బాధిత కుటుంబాల తక్షణ ఆర్థిక అవసరాలు తీర్చేందుకు వీలుగా రూ.25 లక్షల చొప్పున మధ్యంతర సాయం అందిస్తామని ఎయిరిండియా తెలిపింది.

## మతపరమైన అంశాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదు

- **భారత్ విదేశాంగ శాఖ వెల్లడి**

**ఢిల్లీ, జూలై 4:** భవిష్యత్తులో తన వారసత్వం కొనసాగుతుందని.. వారు అమ్మాయైనా, అబ్బాయైనా కావొచ్చని టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. మరోవైపు దలైలామా వారసుడి ఎంపిక నిర్ణయంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో.. ఈ అంశంలో జోక్యం చేసుకోవడం తగదంటూ భారత్‌పై చైనా వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామాల వేళ భారత ప్రభుత్వం స్పందించింది. మత విశ్వాసాలు, ఆచారాల్లో భారత్ ఎప్పుడూ జోక్యం చేసుకోదని స్పష్టం చేసింది. దీర్ఘకాలంగా ఇదే వైఖరిని కొనసాగిస్తున్నామని పేర్కొంటూ విదేశాంగశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది.




'తన వారసత్వం గురించి ప్రస్తుత దలైలామా ప్రకటనకు సంబంధించిన నివేదికలు చూశాం. అటువంటి మతపరమైన అంశాల్లో భారత్ ఎప్పుడూ జోక్యం చేసుకోదు. దీర్ఘకాలంగా ఇదే వైఖరిని కొనసాగిస్తోంది' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. భారత్‌లోని అందరి మత స్వేచ్ఛను ప్రభుత్వం గౌరవిస్తుందని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తుందన్నారు.దలైలామా వారసుడి ఎంపిక నిర్ణయంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల మాట్లాడటంపై స్పందించిన చైనా.. టిబెట్ విషయాల్లో భారత్ జోక్యం చేసుకోవడం తగదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాలని పరోక్ష హెచ్చరికలు చేసింది. మరోవైపు తన మరణానంతరం దలైలామా వారసత్వం కొనసాగుతుందని.. భవిష్యత్తు గురువును (పునర్జన్మ పొందిన బాలుడిని) గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని దలైలామా ఇటీవలే స్పష్టం చేశారు.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో

# ప్రజా పోరాటాలకు సిద్ధం కండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు



**తిరుమలగిరి, జూలై 4 (మనం న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. శుక్రవారం తిరుమలగిరి పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79 వర్థంతిని నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిలిచిన అమరుడు అన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్గి రవ్వ దొడ్డి కొమరయ్య అమరత్వానికి 79 ఏళ్లు నిండుతున్న తెలంగాణ సాయిధ పోరాట స్ఫూర్తి నేటికీ రగులుతూనే ఉందన్నారు. 1946 నుండి 1951 వరకు జరిగిన సాయుధ పోరాటంలో భూమిలేని పేదలకు 10లక్షల ఎకరాల భూమి పంచి తెలంగాణ పల్లెల నుండి దొరలను, నిజాం రజాకార్లను తరిమి కొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదని, సాయుధ పోరాటంలో నిజాం రజాకర్ సైన్యాలకు పటేల్ సైన్యాలకు ఎదురొడ్డి పోరాడి 4,000 మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రాణ త్యాగాలు చేసి దున్నేవాడికే భూమి, ప్రజలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేయడం జరిగిందని అలాంటి త్యాగాల చరిత్రను ఇప్పుడున్న బిజెపి నాయకులు తెలంగాణ పోరాటం ముస్లిం రాజుకు హిందూ ప్రజలకు మధ్య గొడవగా చిత్రీకరిస్తున్నారని, తెలంగాణ ప్రజల పోరాట వారసత్వాన్ని అపహస్యం చేస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో పేదలకు కార్మికులకు ఒరిగిందేమీ లేదని ప్రజలకు మేలు చేయకపోగా పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను అమలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రజలను కార్మికులను గంపగుత్తాగా బానిసలుగా చేసే కుట్ర చేస్తున్నారని ప్రభుత్వ రంగాన్ని మొత్తం నిర్వీర్యం చేసి విద్యా, వైద్యం, ఉద్యోగం, ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట వారసులుగా విద్యా వైద్యం ఉద్యోగం కనీస వేతనాలపై పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య, జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కడారి లింగయ్య, చిత్తలూరు సోమయ్య, తిరుమలగిరి శాఖ సభ్యులు భిక్షం, కొమ్ము సోమయ్య, సామాజిక తెలంగాణ రాష్ట్ర నాయకులు కొత్తగట్టు మల్లయ్య, చేను శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## పీర్ల పండుగ ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించాలి



- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య

**తిరుమలగిరి జూలై 4(మనం న్యూస్):** పీర్ల (సవార్ల) పండుగను ప్రభుత్వం ఖర్చులతో నిర్వహించాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీర్ల పండగ నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతూ ఒక సవారి నిలుపుకోవడానికి ఖర్చు 3000 నుండి 4000 రూపాయల ఖర్చు అవుతుందన్నారు. పండగ నిర్వాహకులకు ఇంత ఖర్చవుతున్నా ఏలాంటి ఆదాయం లేదని, ప్రభుత్వం ఖర్చులతో నిర్వహించి తెలంగాణ సంస్కృతిని కాపాడాలని కోరారు. రోజు రోజుకు నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగి పోవడం వల్ల సవార్ల పండుగ నిర్వహించే నిర్వాహకులు ఆర్థిక భారం ఎక్కువ అయ్యి నిర్వహించలేని పరిస్థితి ఉన్నదని చెప్పారు. దేవాలయాలకు దేవాలయ భూములు ఉన్నా, వాటికి ఆదాయ వనరులు ఉన్నాయని, కానీ సవర్ల పండగ నిర్వహించే నిర్వాహకులకు ఏలాంటి వనరులు లేవన్నారు. ఈ కార్యక్రమంలలో పాలబిందెల యాదగిరి సుభాష్, ముత్తయ్య, కొండయ్య, సోమయ్య, యాదగిరి, మల్లయ్య, అంజయ్య, వెంకన్న, యాదగిరి,రాములు, శీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించమంటే.. అరెస్టు చేస్తారా?

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్



**నల్లగొండ, జూలై 4(మనం న్యూస్):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని. నిరుద్యోగ యువత హక్కుల సాధనకై చలో సచివాలయం ముట్టడినీ పిలుపునిస్తే పోలీసులచే అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. గురువారం అర్ధరాత్రి మహేష్ ను అరెస్ట్ చేసి నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్కు పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాజకీయ జోక్యం లేకుండా రాజీవ్ యువ వికాస్ స్కీమ్ను వెంటనే అమలు చేయాలి. రెండు లక్షల ఉద్యోగా లను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చలో సచివాలయ కార్యాలయాన్ని ముట్టడిని పిలుపునిస్తే పోలీసులచే అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. ఎన్ని అక్రమ అరెస్టులు నిర్బంధా లు పెట్టిన చలో సచివాలయం ముట్టడికి విజయ వంతం చేస్తామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో నిరుద్యోగ యువతతో రాష్ట వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా మరింత ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 50 మంది డీవైఎఫ్ఐ నాయకులను అర్ధరాత్రి నుండి అక్రమ అరెస్టులు చేసారన్నారు. అరెస్ట్ అయిన నాయకుల ను తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు.

# చదువుతోనే ఉన్నత స్థాయికి..

- పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి
- తప్పుడు నిర్ణయాలు జీవితాన్ని ప్రశ్నార్థకం నెట్టుతాయి
- తల్లిదండ్రులు ఆశలను నేరవేర్చడం పిల్లల బాధ్యత
- జిల్లా ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట, జూలై 4(మనం ప్రతినిధి):** సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పట్టణ పరిధిలోని ఇమాం పేట వద్ద తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ బాలికల కళాశాలను శుక్రవారం జిల్లా ఎస్పి నరసింహ సందర్శించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవడం, లక్ష్య సాధనకు పట్టుదలతో నిరంతర కృషి చేయడం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులకు సృజనాత్మక అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి రావాలి ఉత్తమమైన, ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకోవాలి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి ఎస్పి వివరించారు. అందరికీ జిల్లా పోలీసు శాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు. నేను ప్రభుత్వ పాఠశాల లోనే చదివా, నేను ఈ స్థాయికి ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అందరూ సహాయ సహకారాలు అందించారు, మంచి మనసు మంచి మార్గంలో నడిపిస్తుంది, చెడు ఆలోచన చెడు వైపు నడిపిస్తుందన్నారు. వత్తిడికి గురవకుండా విద్యార్థులు బాగా చదువుకోవాలి. గడిచిన సమయం తిరిగిరాదు, సమయాన్ని వృదా చేయకుండా ప్రతి నిమిషాన్ని మంచి చేయడానికి, జ్ఞానాన్ని సాధించడానికి వినియోగించాలి అని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు వసతులు, అవకాశాలు బాగా పెరిగాయి. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని, పాఠాలను రోజు రోజు క్రమం తప్పకుండా చదువుకోవాలి. తప్పులు చేయవద్దు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలి. ప్రభుత్వాలు మంచి వసతులు కల్పిస్తూ విద్యను అందిస్తున్నాయి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. ఇతరులను ఇబ్బందులకు గురి చేయవద్దు, పెద్దలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను గౌరవించాలి. సమస్యలు ఉంటే క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు, ఉపాద్యాయులు, తల్లిదండ్రులకు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది అన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**పెన్ పహాడ్, జూలై 4(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు సిఐటి జిల్లా కమిటీ సభ్యులు రణపంగ క్రిష్ణ కార్మికుల పిలుపునిచ్చారు. శుక్రవారం భక్తాలపురం, ధర్మాపురం,మహ్మదాపురం గ్రామాలలో జరిగిన ప్రజా సంఘాల గ్రామ సదస్సు కు ముఖ్య అతిదులుగా హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశాన్ని మొత్తం కార్పొరేట్ శక్తులకు అనుకూల చట్టాలను అమలు చేస్తున్నారని అందులో భాగంగానే పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే 4 లేబర్ కోడ్ లు తెచ్చారని వారు అన్నారు చట్టాలను రక్షించుకోవడంకోసం ఈనెల 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నెమ్మాది లక్ష్మి, ఇరుగు రమేష్, నెమ్మాది పీరయ్య, నాగేల్లి రజిత, గొని ఎంకన్న, గంధం రాములమ్మ, గుండు వినోద, వీరస్వామి, సుమలత, బొల్లి కొండ లక్ష్మయ్య, గురవయ్య, అడిమయ్య,సోమన్న, గంధం నాగయ్య,లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు అవశ్యం

- ధాన్యం కొనుగోలుకు సామగ్రి ముందే సిద్ధం చేసుకోవాలి
- కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



**నల్లగొండ, జూలై 4(మనం ప్రతినిధి):** రానున్న ఖరీఫ్ సీజన్ లో దాన్యం కొనుగోలుకు కావలసిన సామగ్రి కై ముందు నుండే సిద్ధం కావాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన తన చాంబర్లో ఖరీఫ్-2025 సీజన్‌కు ఆయా వ్యవసాయ మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ,కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉండగా, ఇటీవల జిల్లా యంత్రాంగం రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులకు మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అలాంటి మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లను అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగింది. రబీలో 2000 మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం వచ్చిన 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను ఏర్పాటు చేసే విషయం, తూకం,తేమ కొలిచే యంత్రాలకు మరమ్మతు చేయించి సిద్ధంగా ఉంచుకోవడం ,అలాగే ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మరిన్ని టార్పాలిన్లను ఇచ్చే విషయం సమావేశంలో చర్చించారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు ఛాయా దేవి, పౌర సరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిసీఓ పత్యా నాయక్, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## దోసపహాడ్ ప్రాథమిక పాఠశాలకు ఒక యూనిట్ టాయిలెట్స్ మంజూరు

### విద్యార్థినుల ఆవేదనకు స్పందించిన మండల అభివృద్ధి అధికారి



**పెన్ పహాడ్, జూలై 4(మనం న్యూస్):** పెన్ పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు మామిడి వెంకటయ్య ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి జంజనాల వెంకటేశ్వరరావుతో విద్యార్థులు సంభాషిస్తూ తమ పాఠశాలలో మూత్రశాలలు లేవని, బహిర్భూమికి బయటకు వెళ్లాల్సి వస్తుందని ఎంతో ఆవేదనతో చెప్పడంతో దానికి మండల అభివృద్ధి అధికారి స్పందిస్తూ తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పాఠశాలకు ఒక యూనిట్ టాయిలెట్స్ మంజూరు చేస్తానని వాగ్దానం చేయడం జరిగింది. దీంతో విద్యార్థులు ఎంతో సంతోషించి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటయ్య మాట్లాడుతూ తమ పాఠశాలకు సంబంధించిన మౌలిక వసతులు కల్పిస్తారని మాట ఇచ్చిన ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక క్షేత్ర పర్యటనలో బాలికలు తమ అవసరాల కోసం ఒక విజయాన్ని సాధించారని ఈ అవకాశం కేవలం తమ పాఠశాల విద్యార్థులకే దక్కిందన్నారు. ఇలా అందరూ కూడా తమకు కావాల్సిన వసతులను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**సూర్యాపేట జూలై 4 (మనం ప్రతినిధి):** ఈనెల 2వ తేదీన మోతె మండలం నాగయ్యగూడెం గ్రామానికి చెందిన నిమ్మరబోయిన వెంకన్న అనే 60 ఏండ్ల వ్యక్తి విభులాపురం గ్రామ శివారులో మామిళ్ళగూడెం వెళ్ళ రోడ్డు మార్గంలో తీవ్రమైన గాయాలతో పడి ఉండగా, అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. వెంకన్న కూతురు స్వరూప ఇచ్చిన ఫిర్యాదుపై మోతె పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగినది. ఈ దర్యాప్తులో భాగంగా శుక్రవారం నమ్మదగిన సమాచారంపై ఉదయం 10 గంటల సమయంలో మామిళ్లగూడెం ఎక్స్ రోడ్డు వద్ద హత్యకు పాల్పడిన నిందితుడు నిమ్మరబోయిన నాగయ్యను మోతె ఎస్సై యాదవేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ కేసు సంబంధించి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసు విషయాలు సంబంధించి ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూమి సంబందిత తగాదా విషయమై తండ్రి కుమారులకు మద్య గత కొద్ది నెలలుగా వివాదం జరుగుతున్నదని ఇదే విషయమై 5 నెలల క్రితం వద్ద మనుష్యులు సమక్షంలో తీర్మానం ప్రకారం గా మాఅమ్మా నాన్న లకు ఎకరం భూమి, కుమారులకు చెరొక 1% ఎకరం భూమి మరియ మా కూతురుకు 29 గుంటల వ్యవసాయ భూమి వాటాలు వేసి ఒక అగ్రిమెంట్ కూడా రాసినారని ఎస్పీ తెలిపారు. ఇట్టి భూమి పట్టా చేయలేదు. తరువాత మృతుడు వెంకన్న తన వాటాకు వచ్చిన 1 ఎకరం భూమిని తనకు అప్పులు అయినాయి అమ్ముకున్నాడు. ఈ విషయాలై తండ్రిపె కోపంతో అతనిపై పగ పెంచుకుని అతనిని ఎలాగెనా చంపాలని అదునుకొరకు చూస్తూ ఎప్పుడు ఒంటరిగా దొరికితే అప్పుడు అతనిని చంపాలని తాను తన బైక్ పైన గొడ్డలి పెట్టుకొని నిందితుడు సమయం కోసం తిరుగుతున్నారని చెప్పాడు.

జూలై 2న మధ్యాహ్నం నిందితుడు తన బైక్ పైన మోతెకు వెళ్ళి తిరిగి తమ ఇంటికి వస్తు మోతే గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకొని వస్తుండగా అదే సమయంలో మృతుడు ద్విచక్ర వాహనంపై వెళ్ళుచుండటం గమనించి గుర్తుపట్టకుండా నిందితుడు హెల్మెట్ ధరించి మోపెడ్ విభాలాపురం గ్రామ శివారులో తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో దాడిచేశాడు. నిందితుడు అక్కడి నుండి పాయిపోవడం జరిగినది. ఇతనిని నేడు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరుగుతుందన్నారు. ఈ కేసులో బాగా పనిచేసిన మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డిని, ఎస్సై యాదవేందర్ రెడ్డిని, స్టేషన్ సిబ్బందిని కేసు పర్యవేక్షణ చేసిన డీఎస్పీ శ్రీధర్ రెడ్డిని జిల్లా ఎస్పీ నరసింహ అభినందించారు.




# గంజాయి విక్రయిస్తున్న నిందితుల పట్టివేత

- ఆరుగురు నిందితులని అరెస్ట్
- సుమారు రూ.3 లక్షల సొత్తు గల 11 780 కేజీ ల గంజా
- 6 సెల్ ఫోన్ లు స్కూటి స్వాధీనం
- ఎన్‌డీపీఎస్ డీపీ ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు
- డ్రగ్స్ రవాణా వినియోగం అమ్మకం నేరం కఠిన శిక్షలు తప్పవు
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ




**సూర్యాపేట జూలై 4(మనం ప్రతినిధి)** గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను సూర్యాపేట పట్టణంలో పట్టుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. శుక్రవారం. జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశం లో ఎస్పీ కేసు వివరాలు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వం నుంచి సృష్టమైన ఆదేశాలు ఉన్నాయి సమాజం నుండి డ్రగ్స్‌ను డ్రగ్స్ రైతు సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి, దీనికోసం జిల్లా పోలీస్ శాఖ పటిష్టంగా పనిచేస్తుంది అన్నారు. గంజాయి రవాణా వినియోగము అమ్మకం లాంటి కేసుల్లో ఉన్న వారి అందరికీ కౌన్సిలింగ్ లు ఇస్తున్నాము. యువత దీని నుండి అప్రమత్తంగా ఉండాలి ఎవరైనా అలవాటు చేయాలని ప్రయత్నిస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలి అని ఎస్పి వెల్లడించారు... నమ్మదగిన సమాచారంతో గురువారం సాయంత్రం సూర్యాపేట పట్టణములోని నల్లచెరు గుట్ట పై ఆరుగురు వ్యక్తులు గంజాయి తో ఉన్నారు అనే సమాచారం మేరకు, జిల్లా సిసిఎస్. పోలీసు సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య బృందం యస్.ఐ ఎం. ఏడుకొండలు. సిబ్బంది తో యుక్తముగా నల్లచెరు గుట్ట వద్దకు వెళ్ళగా అక్కడ (6) మంది వ్యక్తులు ఒక స్కూటి తో నల్లచెరు గుట్ట వద్ద గంజాయితో కూర్చొని ఉండగా, యస్. ఐ తన సిబ్బందితో యుక్తంగా పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నిందితులను విచారణ చేయగా తమ పేర్లు 1. పిట్టల నాగరాజు 2. అంగోతు వంశీ, 3. రెడ్డి పల్లి మధుసూదన్, 4. కూతురు ఆకాశ్,5. శూర శ్రవణ్ కుమార్ 6. గుండారపు శివ, తెలపడం జరిగింది. ఇందులో పిట్టల నాగరాజు, అది వంశీ లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని విశాఖపట్నము దగ్గరగల అరకు ప్రాంతములో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొని తీసుకొని వచ్చి అట్టి గంజాయిని చిన్న చిన్నపొట్లాలు చేసి ఐదు నుండి పది గ్రాముల ఒకొక్క పొట్లంమును 500 రూపాయలకు అమ్మి డబ్బులు సంపాదిస్తున్నట్లు తేలింది.వీరితో సంబంధం ఉన్న మరో నలుగురు పరారీలో ఉన్నారు వారిని పట్టుకోవడానికి పోలీస్ టీమ్స్ పనిచేస్తున్నాయి. నిందితులు అందరూ ఒక్కొక్కలు 3000/- రూపాయలు వేసుకొని 30,000/- రూపాయలతో తేదీ: 30-06-2025 రోజు నాగరాజు, ఆది వంశీ, సూర్యాపేట నుండి బస్ లో ఖమ్మంకు వెళ్ళి ఖమ్మం నుండి రైలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని విశాఖపట్నము వెళ్ళి విశాఖపట్నము దగ్గర గల అరకు ప్రాంతము లో 12 కేజీల గంజాయిని ఒక్క కేజీ 2000/- రూపాయల చొప్పున కొనుక్కొని, 12 కేజీల గంజాయిని 24,000/- రూపాయల గుర్తుతెలియని వారి వద్ద కొనుగోలు చేయడం జరిగిందని తెలియజేశారు. గురువారం ఉదయం సమయమున సూర్యాపేటకు వచ్చి అట్టి గంజాయిని సూర్యాపేట పట్టణములో నాగరాజు ఇంటిలో ఏవరికి కనిపించకుంట దాఛీపెట్టి. గంజాయిని అంధరికీ పంచుటకు నల్లచెరువు గుట్ట వద్దకు పిలవగా అంధరు ఒకచోట కలిసి సాయంత్రము 04:30 గంటల సమయంలో నాగరాజు నల్లచెర్వు గుట్ట వద్దకు అరకు నుండి తీసుకు వచ్చిన గంజాయిని తీసుకొని వచ్చుటకు ముందుగానే అంగోతు వంశీ వద్ధ అతని స్కూటీని తీసుకొని అట్టి గంజాయిని బైక్ పై నాగరాజు ఇంటిలో నుండి తీసుకొని నల్లచెర్వు గుట్ట వద్దకు రాగా, ఆది వంశీ తనకు పని ఉంది అని అతని యొక్క బాగమును నాగరాజు తీసుకోనినాడు, విశ్వనాదుల సాయి కుమార్ తనకు పని ఉంది అని అతని యొక్క బాగమును అంగోతు వంశి తీసుకోనినాడు, దోసపాటి వంశీ తనకు పని ఉంది అని అతని యొక్క బాగమును రెడ్డిపల్లి మధుసూదన్‌ను తీసుకోమనినాడు, సారగండ్ల శివ కార్తీక్ తనకు పని ఉంది అని అతని యొక్క బాగమును కూతురు ఆకాశ్ తీసుకోనినాడు. అంధరు నల్లచెర్వు గుట్ట పై కలిసి అట్టి గంజాయిని పంచుకోనుటకు బ్యాగ్ లో నుండి గంజాయిని తీసి బయట పెట్టగా అదే సమయములో పోలీసు ఆ ప్రాంతానికి వెళ్ళి గంజాయి తో పాటు నిందితులు ఆరుగురుని పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు.ఈ సమావేశం లో ఎస్పీ వెంట సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, మహేంద్ర నాథ్, హరికృష్ణ, సిసిఎస్ సిబ్బంది, పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

సిబ్బందిని అభినందించి రివార్డు అందజేత

ఈ కేసులో గంజాయి సీజ్ చేయడం నిందితులను అరెస్ట్ చేయడంతో భాగా పని చేసిన సిసిఎస్. ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐ హరికృష్ణ, సిసిఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ లు శ్రీనివాస్, కానిస్టేబుల్ ఆనంద్, మల్లేష్, సతీష్, శివ కృష్ణ, ప్రభాకర్, మహిళా హోమ్ గార్డ్ మంజుల, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రమేశ్, సూర్యాపేట పట్టణ సిఐ ఎ. వెంకటయ్య ఎస్సై లు ఎం. ఏడుకొండలు, ఐ. మహేంద్రనాథ్, వారి సిబ్బంది, నవీన్, రవి కిరణ్, రవి, ఈశ్వర్ సింగ్ , సురేష్, రైటర్ వీరయ్య, లక్ష్మినారాయణ, బజార్‌లను ఎస్పీ , మిగతా సిబ్బంది, అనధికారులు అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## భూభారతి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**వెంకటాపురం,జూలై 4 (మనంన్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తెలిపారు. శుక్రవారం వెంకటాపురం మండలం రాచపల్లి గ్రామంలో, మల్లాపురం హ్యాబిటేషన్ లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు, ఇప్పటి వరకు ఎంతవరకు పూర్తి చేశారు, ఏవైనా సాంకేతిక లేదా సామగ్రి సంబంధిత సమస్యలున్నాయా?,ఇసుక ఎక్కడి నుండి తీసుకుంటున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. మండలంలోఇసుక అందుబాటులో ఉందని, లబ్ధిదారులు అక్కడినుండే తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పనులను దశలవారీగా పూర్తి చేస్తూ సంబంధిత ఫోటోలు, వివరాలను వెబ్సైట్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శుక్రవారం వెంకటాపురం మండలం తహసిల్దార్ కార్యాలయం లో రికార్డ్ రూమ్ పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నూగూర్ రెవిన్యూ గ్రామం లో డ్రోన్ సర్వే పై ఏ డి సర్వే డిపార్ట్మెంట్, సర్వేయర్లు మరియు ఏజెన్సీ లు నిర్వహించిన సర్వే తీరును అధికారులు కలెక్టర్ కు వివరించారు. సర్వే మ్యాప్ లను కలెక్టర్ పరిశీలించారు. భూ భారతి రెవిన్యూ సదస్సుల దరఖాస్తుల గురించి కలెక్టర్ ఆరా తీశారు.దరఖాస్తుదారులకు రసీదులు అందించారా అని కలెక్టర్ ఆరా తీశారు. వచ్చిన అర్జీలను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తూ ఆన్లైన్ లో వెను వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఆర్డీఓ వెంకటేష్, ఏ డి ఎస్ ఎల్ ఆర్ దేవరాజు, తహసిల్దార్ వేణుగోపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య




- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, జూన్ 4 (మనం ప్రతినిధి):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఉద్యమ కారుడు తొలి అమరుడు శ్రీ దొడ్డి కొమరయ్య అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి పురస్కరించుకొని జిల్లా సంక్షేమ భవన్ లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో దొడ్డి కొమరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమవడానికి భూమికోసం, భుక్తికోసం, విముక్తి ఉద్యమంగా పోరాటం మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణం, తెలంగాణ సాయుధ పోరాటానికి మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సర్దార్ సింగ్, నరిగె రాజుకుమార్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, సాంబయ్య జిల్లా కురుమ సంఘం ఉప అధ్యక్షుడు, యార మల్లయ్య, గోవింద రాజుకుమార్ కురుమ యువ చైతన్య అధ్యక్షుడు నరిగె సంపత్ ములుగు మండల అధ్యక్షుడు రాసా కుమార్ ములుగు జిల్లా కోశాధికారి, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియషణ్ ములుగు జిల్లా అధ్యక్షుడు గుల్లగట్టు సంజీవ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి లక్ష్మన్, బిసి కార్యాలయ సిబ్బంది, బిసి వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు సరిత, మానస, రేణుక, సాడలు, కుమారస్వామి, ప్రతాప్, గోపాల్ చారి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



**బచ్చన్నపేట,జూలై 4, మనం న్యూస్:** ప్రజలు ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నర్మెట్ట సీఐ అబ్బయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పోచన్నపేట గ్రామంలో స్థానిక ఎస్సై ఎండి హమీద్ తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కరెంటు విషయంలో జాగ్రత్త పాటించాలని తగు సూచనలు గ్రామపంచాయతీ సిబ్బంది ఇవ్వాలని దొంగతనాల నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గ్రామ ప్రజలు దాతల సహాయంతో గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య 79 వర్ధంతి



**తొర్రూరు, జూలై 04 (మనం న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం బస్టాండ్ సమీపంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించడం జరిగింది కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హోమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు భూమికోసం భుక్తి కోసం దున్నేవాడికే భూమి అని నినాదంతో నాటి రామచంద్ర రెడ్డి అరాచక సైన్యమైనటువంటి రజాకారులను ఎదిరించిన దొడ్డి కొమురయ్యను ఎట్లనైన చంపాలని ఈ ఒక్కని చంపితే పోరాటం చేయడానికి ముందు ఎవరు రారా అని దొడ్డి కొమురయ్యను రజాకారులు చుట్టుముట్టి తుపాకులతో కాల్చి చంపారు కానీ ఆ ఒక్కరితో ఆగకుండా సాయుధ పోరాటంలో వందనాలు మంది ప్రజలు పాల్గొని తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకంగా మారి రామచంద్ర రెడ్డి రజాకారులపై ఎదురుదాడికి దిగి రజాకారులను తరిమికొట్టి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారు దున్నేవాడికే భూమి అనే నినాదంతో దొడ్డు కొమురయ్య వారసత్వాన్ని ఉనికిపుచ్చారు సహాయ కార్యదర్శి, గణపురం లక్ష్మణ్, పెరబోయిన కిరణ్ కుమార్, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కోటగిరి యకాంతం, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ముదురబోయిన వెంకన్న ,రమేష్ యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- **జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్.పి**



**ములుగు, జూలై 4 (మనం ప్రతినిధి):** ములుగు జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల రోజుల (జూలై 4వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఐపిఎస్ తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పి సూచించారు. కావునా శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు. ములుగు జిల్లా పోలీస్.

## రైతులు అవసరం మేరకు యూరియా వాడాలి



- **వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీని తనిఖీ చేసిన కలెక్టర్**

**సంగెం,జులై 4 మనం న్యూస్ :** రైతులకు ఎరువులు, అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామంలో వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీలో ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువుల నిలువలు, స్టాకు రిజిస్టర్లు, గోదాం, తూకం యంత్రాలు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఎరువులు, నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. దుకాణం ముందు స్టాకు నిల్వ, ధరల పట్టిక వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. ఎరువులు విత్తనాలు అధిక ధరలు విక్రయిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు అవసరం మేరకు యూరియా వాడాలని, అధిక నిల్వలు చేసుకోకూడదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యాకయ్య, తహసీల్దార్ రాజ్ కుమార్, పిఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నీటి ప్రభావం పెరిగింది



- **ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**మంగపేట, జూలై 4 (మనంన్యూస్):** గోదావరి ప్రభావం పెరిగిందాని, ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. శుక్రవారం ఏటూరు నాగారం మండలంలోని రామన్నగూడెం కరకట్టను, మంగపేట లోని పొడుమూరు కరకట్టను, వరద తీరాన్నిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వరద కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సకాలంలో నివాస గ్రామాలను ఖాళీ చేయాల్సిన అవసరం తలెత్తిన పక్షంలో తగిన చర్యలు తీసుకోవడానికి, గోదావరి నదిలో నీటి మట్టాన్ని నిరంతరం పై అధికారులకు నివేదించాలని సాగునీటి శాఖ, ఎంపీడీఓ, తహసీల్దార్, సిబ్బందికి సూచించారు. అలాగే, ప్రమాదకర ప్రాంతాల్లో తగినంత ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. గోదావరి నదిలో నీటి మట్టం పెరుగుదలపై 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, వరద సమయంలో సకాలంలో చర్యలు తీసుకోవడానికి కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ జగదీశ్వర్, తహసిల్దార్ జగదీష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలు



**చెన్నారావుపేట, జూలై 4 (మనం న్యూస్):** మండల కేంద్రంలో స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జంక్షన్లో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఇంచార్జి బాల్నే వెంకన్న, మాజీ జడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ లు కుండె మల్లయ్య, బానోతు గణేష్, హంస విజయ రామారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సాంబయ్య, ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డి , మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శమూర్తి కొనిజర్ల. రోశయ్య



**మరిపెడ, జూలై 04(మనం న్యూస్):** నేటి సమాజంలోని యువతి, యువకులకు ఆదర్శమూర్తిగా మాజీ గవర్నర్, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొనిజర్ల. రోశయ్య అని ఆర్యవైశ్య సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు తల్లాడ. వెంకట రామారావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని సీతారాంపురం పాఠశాలలోనీ ప్రధానోపాధ్యాయుడు గుగులోతు. అర్జున్ ఆధ్వర్యంలో మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొనిజర్ల. రోశయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని 150 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ! ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కొరకు సహాయ సహకారాలు అందించడానికి ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కొనిజర్ల. రోశయ్య పరిపాలన కాలంలో సబ్బండ వర్గాల ప్రజలు సుఖ సంతోషంగా ఉన్నారన్నారు. వారు ఉన్నతమైన పదవులు చేపట్టటం ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్, కిరాణం అసోసియేషన్, ప్రతినిధులు ఎం. వెంకట నరసయ్య ,బి. నాగేశ్వరరావు, కే. ప్రసాద్, టి. చంద్రమోహన్, బి. శ్రీను, జి. వెంకన్న, వి. సత్యనారాయణ, వి. భరత్, కే .మధు, పురుషోత్తం, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా కొరల్లో అర్పణపల్లి ఊర చెరువు?

### అక్రమదారుల్లో ఊర చెరువు?

### పట్టించుకోని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు?



**కేసముద్రం జూలై 4(మనం న్యూస్):** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో ఊర చెరువు కబ్జా గురించి గురి అయిందని అర్పణపల్లి గ్రామ ప్రజలు, రైతులు ఆరోపణలు చేస్తున్నరు..గ్రామ శివారులో సర్వే నంబర్ 4 లో 74ఎకరాల విస్తీర్ణం కలదు. ఈ యొక్క అయకట్టు కింద 150 ఎకరాలు సాగు విస్తీర్ణం కలదు, ఖరీఫ్, రభి పంటలతో రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. రైతులు ఈ యొక్క ఊర చెరువు పైన ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తూ వారి జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు.. భవిష్యత్తు లో ఊర చెరువు శిఖరమును లేకుండా కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువు శిఖరము ఎఫ్ టీ ల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్ ) భాఫర్ జోన్ పరిధిలో కబ్జా గురి అయింది అని గ్రామ రైతులు ఆరోపణలు చేస్తున్నారు.. వాల్టా యాక్ట్ ను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవరిస్తూన్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.. భవిష్యత్ లో అర్పణపల్లి ఊర చెరువు మొత్తం కబ్జా గురి అయ్యే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఈ చెరువు శిఖరములో గత ప్రభుత్వం మొదటి సారి అధికారంలోకి వచ్చిన తరవాత మిషన్ కాకతీయలో ఊర చెరువు ను మొదటి విడుతలో సుమారుగా 56 లక్షల తో చెరువు పూడిక తిత చేసి చెరువు అభివృద్ధి చేశారు. కానీ కబ్జా దారులు అవి ఏమి పట్టింకకోకుండా ఇష్టానుసారంగా కబ్జా చేస్తూ ఉర చెరువును రోజురోజుకీ పూడ్చి వేస్తున్నారు.. ఇప్పటికైనా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఊర చెరువు శిఖరము ను జాయింట్ సర్వే చేసి రెవిన్యూ బౌండరి హద్దులు వేసి, ఎఫ్ టి ల్ ( ఫుల్ ట్యాంక్ లెవెల్ ) బఫర్ జోన్ పరిధిలను గుర్తుంచి అర్పణపల్లి ఊర చెరువు కాపాడాలని గ్రామ ప్రజలు,రైతులు, యూవకులు, మేధావులు కోరుతున్నారు.

## ప్రజా ప్రతినిధిగా గొప్ప సేవలందించారు



- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు, జులై 4 (మనం ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా పౌర సంబంధాల అధికారి యం డి రఫిక్, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, సలీం రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాలకు గవర్నర్ గా విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. రోశయ్య రాజకీయ జీవితమంతా ప్రజల సంక్షేమం, నిస్వార్థ సేవకే అంకితమైందని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొని రోశయ్య సేవల్ని స్మరించుకున్నారు.

## కోటంచ ఆలయంలో వనమోత్సవం...

### మొక్కలు నాటిన ఈవో మహేష్, చైర్మన్ బిక్షపతి..



**రేగొండ,జూలై 4( మనం న్యూస్ ):** రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలోని ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానము వనమోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. శుక్రవారం వనమహోత్సవం లో భాగంగా మామిడి, ఉసిరి, రావి మర్రి తులసి మొదలగు మొక్కలను పూజార్ల వేద మంత్రోచ్చారణల మధ్యన ఆలయ ఆవరణలో నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయంలో ఉండాల్సిన ఉసిరి రావి మర్రి తులసి వంటి మొక్కలను గుంతలు తవ్వి మొక్కలను ఈవో మహేష్, చైర్మన్ ముల్కనూరు బిక్షపతి, ఆలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీటిని పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి యస్. మహేష్, ఆలయ చైర్మన్ ముల్కనూరి బిక్షపతి, ఆలయ అర్చకులు, ధర్మకర్తలు యం. ఓంకార్, యం. శ్రీధర్ ఆలయ గోరంట్ల శ్రావణ్,కొమురాజు రవి,సుధాకర్, నాగుల సుదర్శన్ ఆలయ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు ఆలయంలో స్వామివారి కళ్యాణం..**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి ఏటా మాదిరి గానే లోక కళ్యాణార్థం స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్ర కళ్యాణం నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుంచి శ్రీ సుదర్శన హోమం, 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ స్వామివారి అభిషేకం, 11 గంటల నుంచి 12 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని ఈవో మహేష్ తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ అనంతరం ఆరగింపు తో ఉత్సవాలు ముగుస్తాయని, ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈవో మహేష్ కోరారు.

## సార్వత్రిక సమ్మెకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు!

- **జిల్లా ఉపాధ్యక్షులు జిన్నలచ్చయ్య**



**మరిపెడ, జూలై 04(మనం న్యూస్):** మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ! సమ్మెలో పాల్గొంటున్నట్టు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా. లచ్చయ్య తెలిపారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ! కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతికటించాలని, పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని భలించేందుకు తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలకు పెంచటం దుర్మార్గమైన చర్య అన్నారు .కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ వాటి స్థానంలో 4 కోడ్స్ తీసుకురావడం కార్మిక హక్కులను అణిచివేయడమే అన్నారు. 9 కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కెవిపిఎస్ సంపూర్ణమైన మద్దతును ప్రకటిస్తూ సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశంలో బాణాల. ఎల్లయ్య, వడ్లకొండ. గంగరాజు, గంగుల. వెంకటేష్, గోపి. రమేష్, బాసిపంగు. వికాస్, పత్తిపాటి. వినయ్, నందిపాటి. ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## నా ఫ్యామిలీ గురించి నీకెందుకు? 'ది లివర్ డాక్'పై చెస్ స్టార్ విదిత్ గుజరాతీ ఫైర్

డాక్టర్స్ డే (జులై 1) సందర్భంగా భారత యువ చెస్ స్టార్ విదిత్ గుజరాతీ ఓ పోస్టు చేశాడు. అతడి పోస్టుపై 'ది లివర్ డాక్' ఖాతా నిర్వాహకుడు సైరియాక్ అబ్బి ఫిలిప్స్ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తన కుటుంబ సభ్యులపై చేసిన వ్యాఖ్యలను విదిత్ ఖండిస్తూ సమాధానం ఇచ్చాడు. అసలేం జరిగిందంటే..? డాక్టర్స్ డే పురస్కరించుకుని విదిత్ ''నా కుటుంబానికి హ్యాపీ డాక్టర్స్ డే'' అని పోస్టు చేశాడు. దానికి 'ది లివర్ డాక్' సైరియాక్ స్పందిస్తూ.. ''నన్ను క్షమించాలి. వారిలో ఎవరూ నిజమైన వైద్యులు కారు'' అంటూ కామెంట్ చేశారు. దీనిపై విదిత్ స్పందిస్తూ.. ''వ్యక్తిగతంగానూ, బ్రాండ్‌గానూ ఇతరులను నిందిస్తూ, అవమానిస్తూ ఎదగడమే నీకు తెలుసు. మా పేరెంట్స్ ఎంతోమందికి సాయం చేశారు. ముందు నీ పరిధిలో ఉండు. ఎవరికైనా ఉపయోగపడేలా ఇకనైనా మారు'' అని గట్టిగా బదులిచ్చాడు.

# ఇంగ్లాండ్ మాజీ మొదలెట్టాడు..



భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తుందని అనిపిస్తే చాలు.. ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు తమ అక్కసు వెళ్లగక్కేందుకు సిద్ధంగా ఉంటారు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో టీమ్‌ఇండియా ఒకే వేదికపై ఆడిన సంగతి తెలిసిందే. ఛాంపియన్‌గా నిలిచేందుకు ఇదే కారణమంటూ ఇంగ్లాండ్ మాజీలు ఆక్షేపించారు. ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు (587) చేయడం.. ఇంగ్లాండ్ త్వరగా మూడు వికెట్లను కోల్పోవడం వారికి కంటగింపుగా మారింది. దీంతో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ డేవిడ్ లాయిడ్ తన నోటికి పని చెప్పడం గమనార్హం. రెండో రోజు ఆటలో భారత ప్లేయర్లు తరచూ బ్రేక్‌లు తీసుకోవడంపై అసహనం వ్యక్తంచేశాడు. మరీ ముఖ్యంగా రవీంద్ర జడేజాను టార్గెట్ చేసినట్లుగా వ్యాఖ్యానించాడు.

''రెండో రోజు ఆట ప్రారంభమైన 15 నిమిషాలకే జడేజా ఆటను ఆపాడు. డ్రింక్స్‌తోపాటు మాత్రలు వేసుకున్నాడు. మళ్లీ 40 నిమిషాల తర్వాత మరోసారి బ్రేక్ తీసుకున్నాడు. అక్కడ అంపైర్లు నిస్సహాయంగా నిలబడ్డారు. అందుకే, కొన్ని ఓవర్లు కోల్పోవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. తప్పకుండా అధికారులు దీనిపై దష్టిసారించి చర్యలు తీసుకోవాలి. ఐసీసీ నుంచి మార్గదర్శకాలు రావాలి. ఏ బ్యాటరైనా గాయపడితే అతడికి బదులు మరొకరు క్రీజ్‌లోకి రావాలి. ఆట కొనసాగుతూనే ఉండాలి. అంతేకానీ, గడ్డి పెరిగిందని చూసేందుకు మా సహచరులు ఇక్కడికి 85 యూరోలు (దాదాపు 10 వేలు) పెట్టి రాలేదు'' అని వ్యాఖ్యానించాడు.

# అండర్ -16 రోజులను గుర్తు చేశావు: కుమారుడి ఇన్నింగ్స్‌పై గిల్ తండ్రి సంతోషం



ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ద్విశతకం బాదాడు. ఏకంగా 269 పరుగులు చేసి అత్యధిక స్కోరు చేసిన ఆసియా సారథిగా నిలిచాడు. ఈక్రమంలో ట్రిపుల్ సెంచరీ మిస్ కావడం అభిమానులను బాధించినా.. అతడి ఆటతీరు మాత్రం ఆకట్టుకుంది. తన కుమారుడి సుదీర్ఘ ఇన్నింగ్స్‌పై గిల్ తండ్రి లక్వీందర్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తల్లిదండ్రులు పంపించిన వాయిస్ మెసేజ్‌ను గిల్ వింటున్న వీడియోను బీసీసీఐ సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

''అద్భుతంగా ఆడావు. నీ బ్యాటింగ్‌ను చాలా ఆస్వాదించా. ఇప్పుడు నా మనసు చాలా ప్రశాంతంగా ఉంది. నీ ఆటను చూస్తుంటే.. అండర్-16, అండర్-19 రోజుల్లో ఆడినట్లే అనిపిస్తోంది. నీ ఆట చూసి గర్వపడుతున్నా'' అని గిల్ తండ్రి వ్యాఖ్యానించారు. ''నీ బ్యాటింగ్‌ను చూస్తుంటే చాలా ఆనందమేసింది. ముున్ముందూ ఇలాగే ఆడుతూ ఉండాలి'' అని గిల్ తల్లి ఆకాంక్షించారు. భారీ ఇన్నింగ్స్ మాత్రమే కాకుండా.. రెండోరోజు ఆటలో అత్యంత క్లిష్టమైన క్యాచ్‌ను అందుకొని శభాష్ అనిపించుకున్నాడు.

**వారిద్దరి అభిప్రాయాలే ముఖ్యం..**

''ఇలాంటివి ఎన్నో ఆయన నుంచి నాకు వస్తూనే ఉంటాయి. అలాగే నేను ట్రిపుల్ సెంచరీ చేజార్చుకోవడం పైనా మేం మాట్లాడుకున్నాం. అయితే, ఈ మ్యాచ్‌లో మేం విజయం సాధిస్తామనే నమ్మకంతో ఉన్నాం. క్రికెట్‌కు సంబంధించి ఇద్దరి అభిప్రాయాలను గౌరవిస్తా. ఒకరు మా నాన్న. మరొకరు నా ఫ్రెండ్ అభిషేక్ శర్మ. నాన్న కోసమే క్రికెట్ ఆడుతున్నా. ఇక నేను ఎక్కువగా ప్రాక్టీస్ చేసింది నా స్నేహితుడితోనే. వారు చెప్పే మాటలను జాగ్రత్తగా వింటా'' అని గిల్ వ్యాఖ్యానించాడు.

# గుడ్ వైఫ్..



సినిమాల్లో బిజీగా ఉంటూనే వెబ్‌సిరీస్‌లు చేస్తున్న నటి ప్రియమణి. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన లీగల్ డ్రామా సిరీస్ 'గుడ్ వైఫ్' . అమెరికన్ వెబ్‌సిరీస్ 'ది గుడ్ వైఫ్' ఆధారంగా అలనాటి నటి రేవతి రూపొందించారు. ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్ ఎలా ఉంది?

అడిషనల్ అడ్వొకేట్ జనరల్ గుణ శీలన్, తరుణికలది అన్యోన్య దాంపత్యం. వీరికి ఇద్దరు సంతానం. అందరికీ ఆదర్శంగా నిలిచిన ఆ జంటే.. తర్వాత అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సెక్స్ కుంభకోణం ఆరోపణలతో గుణ జైలు పాలవుతాడు. అది నిజమో, కాదో తెలియకుండానే భర్తను అసహ్యించుకుంటుంది తరుణిక. తన స్నేహితుడి సాయంతో ఎల్ఏహెచ్ అనే 'లా' సంస్థలో అసోసియేట్ అడ్వొకేట్‌గా జాయిన్ అవుతుంది. న్యాయ పోరాటంలో భాగంగా భర్త కోసమే ఆమె ఈ వత్తిలోకి తిరిగొచ్చిందని అందరూ అనుకుంటారు. మరి, తరుణిక ప్లాన్ అదేనా? గుణ జైలు నుంచి ఎలా బయటకు వచ్చాడు?అసలు అతడు తప్పు చేశాడా? కేవలం అవి ఆరోపణలేనా?

లీగల్ డ్రామా, కోర్ట్‌రూమ్ డ్రామా.. ఇలా పేరు ఏదైనా ఆయా నేపథ్య కథలపై ప్రేక్షకుల్లో ప్రత్యేక క్రేజ్ ఉంది. కోర్టులో 'నువ్వా? నేనా?' అన్నట్టు సాగే వాదప్రతివాదనలే అందుకు కారణం. అలాంటివి ఆశించి 'గుడ్ వైఫ్'ని చూస్తే నిరాశ తప్పదు. ఇందులో ఆ బ్యాక్‌డ్రాప్‌లో ఒక్క సీన్ వర్కౌట్ అయిందంతే. తమ అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా గుణ దంపతులు సెలబ్రేషన్స్ చేసుకోవడం, అదే సమయంలో ఆరోపణల కారణంగా గుణ వార్తల్లో నిలవడం, పోలీసులు అరెస్టు చేయడం.. ఆయా సన్నివేశాలతో సిరీస్ ఉత్కంఠగా ప్రారంభమైంది. కానీ, ముందుకెళ్లే కొద్దీ ఆసక్తి సన్నగిల్లుతుంది. కీలకమైన గుణ కేసును పక్కనపెట్టి, కొత్త అంశాలను తెరపైకి తీసుకురావడం గందరగోళానికి దారి తీసింది

భర్త విషయంలో ఎంత బాధ ఉన్నా తరుణిక దాన్నుంచి తేరుకుని.. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ తనను తాను నిరూపించుకోవడం వంటి సన్నివేశాలు మాత్రం ఆకట్టుకుంటాయి.

# మనసున్న రాజాసాబ్

## ఫిష్‌వెంకట్‌కు ఆపరేషన్ చేయిస్తానన్న ప్రభాస్

**ఆపరేషన్‌కు రూ. 50 లక్షలు అవసరమని కుమార్తె ఆవేదన**

**స్పందించిన హీరో ప్రభాస్ బృందం, ఖర్చులు భరిస్తామని హామీ**

**కిడ్నీ ఇచ్చే దాత కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపులు**





సినీ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వేళ, ఆయనకు అండగా నిలిచేందుకు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ముందుకొచ్చారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్ ఆపరేషన్కు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభాస్ బృందం హామీ ఇచ్చింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కాస్త ఊరట చెందారు. కొంతకాలంగా ఫిష్ వెంకట్ ఆరోగ్యం క్షీణించడంతో, ఆయనను బోడుప్పల్లోని ఆర్బీఎం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయన రెండు కిడ్నీలు విఫలమైనట్లు, గత నాలుగేళ్లుగా డయాలసిస్ పైనే జీవిస్తున్నట్లు ఆయన కుమార్తె స్రవంతి కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం వెంకట్ పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారని ఆమె తెలిపారు. ఇందుకు సుమారు రూ. 50 లక్షలు ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఆదుకోవాలని ఆమె మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న హీరో ప్రభాస్ బృందం వెంటనే స్పందించింది. ప్రభాస్ అసిస్టెంట్ తమకు ఫోన్ చేశారని, 'కిడ్నీ ఇచ్చే దాతను సిద్ధం చేసుకోండి, ఆపరేషన్కు అయ్యే ఖర్చు మొత్తం మేం చూసుకుంటాం' అని హామీ ఇచ్చారని స్రవంతి మీడియాకు వెల్లడించారు. ప్రభాస్ చూపిన ఉదారతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్మీ ఆఫీసర్‌గా పథ్వీరాజ్ సుకుమారన్.. 'సర్‌జమీన్' ట్రైలర్

పథ్వీరాజ్ సుకుమారన్ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సర్‌జమీన్''. డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదల కానుంది. బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. జులై 25 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో పథ్వీరాజ్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించగా.. ఆయన భార్య మీరా పాత్రలో కాజోల్ నటించారు. ఇబ్రహీం ఉగ్రవాదిగా కనిపించనున్నారు. కశ్మీర్ నేపథ్యంలో సాగిన ఈ చిత్రంలో దేశ రక్షణ కోసం ఆర్మీ ఆఫీసర్లు.. ఉగ్రవాదులపై ఎలాంటి పోరు చేశారు. వారు చేసిన సాహసాలేంటి అనేది చూపించనున్నారు. ఈ సినిమాతో కాయోజ్ ఇరానీ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇవ్వనున్నారు.



# ఎన్ని సవాళ్లు ఎదురైనా తమ్ముడు చేయాలనుకున్నా!



నేను గతంలో ''జాను'' అనే మూవీలో నటించాను. ''తమ్ముడు'' కోసం పిలవగానే వచ్చి ఆడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ లో వెంటనే ఓకే అయ్యాను. దర్శకుడు వేణు గారు ఈ మూవీ గురించి చెబుతూ అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ఇప్పుడే చెప్పండి అన్నారు. నేను ఛాలెంజింగ్ గా తీసుకుని చేస్తాను అని చెప్పాను. అలా చిత్ర క్యారెక్టర్ కు నేను సెలెక్ట్ అయ్యాను.

హీరో నితిన్ క్యారెక్టర్ జై కు చిత్ర డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది. జై కు అన్‌కండిషనల్‌గా సపోర్ట్ చేస్తుంది చిత్ర. ఈ సినిమా కోసం నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడాన్ని ఎంజాయ్ చేశాను. తమ్ముడు మూవీ టైటిల్ ఈ కథకు యాప్ట్. పవన్ గారి ఒక సూపర్ హిట్ మూవీ ఈ టైటిల్‌తో ఉండటం మేము హ్యాపీగా ఫీలయ్యే విషయం. నా క్యారెక్టర్ కు ''తమ్ముడు'' కథలో మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలో లయ గారు మరో కీ రోల్ చేస్తున్నారు. ఆమె జర్నీ మా అందరికీ ఇన్‌స్పిరేషన్. హీరోయిన్ గా ఒక కెరీర్ చూసిన ఆమె పర్సనల్ లైఫ్ లోకి వెళ్లడం, మళ్లీ ఇప్పుడు రీ-ఎంట్రీ ఇవ్వడం స్ఫూర్తిగా తీసుకోవచ్చు.

**నా సరదా వ్యక్తిత్వం... నా మాటల్లోని చాతుర్యం అప్పుడప్పుడూ నేను చేసే పాత్రల్లోనూ ప్రతిబింబిస్తూ ఉంటుందని చెబుతున్నారు వర్ష బొల్లమ్మ. 'తమ్ముడు' విషయంలో మాత్రం అలా కుదరలేదని చెప్పుకొచ్చింది. 'విజిల్' తర్వాత.. మళ్లీ 'తమ్ముడు' కోసం ప్రత్యేకంగా సన్నద్ధమై నటించానని ఆమె తెలిపారు. నితిన్ కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు'లో వర్ష బొల్లమ్మ ఓ కథానాయిక. శ్రీరామ్ వేణు దర్శకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా వర్ష గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.**

హీరో నితిన్ చాలా కామ్‌గా ఉంటారని ఒక ఇంప్రెషన్ ఉంది. కానీ ఆయన చాలా ఫన్ పర్సన్. అడవిలో షూటింగ్ చేస్తున్నప్పుడు ఫోన్స్ అవీ ఏమీ లేవు. మేము సరదాగా మాట్లాడుకునేవాళ్లం. చిన్నా, పెద్దా ప్రతి ఆర్టిస్టుకు ఆయన గౌరవం ఇచ్చేవారు. నేను జోక్స్ చెప్పి ఆయనను విసిగించా. నాకు అనిపించింది సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తుంటా. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ పర్‌ఫార్మ్ చేసేప్పుడు అప్పటికప్పుడు ఏదైనా అనిపిస్తే చెప్పాను. కానీ డైరెక్టర్ గారు డైలాగ్ లో ఉన్నది ఉన్నట్లు స్ట్రిక్ట్ గా చెప్పమనేవారు. నేను మిడిల్ క్లాస్ మెలొడీస్ చేసినప్పుడు స్పాంటేనియస్ గా చాలా ఇంప్రూవ్ చేసి డైలాగ్స్ చెప్పాం. ఆ మూవీకి అలా కుదిరింది. ప్రస్తుతం కానిస్టేబుల్ కనకం అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నాను. దీంతో పాటు మరో సిరీస్ చేస్తున్నా. రెండు సినిమాలు కూడా కన్ఫర్మ్ అయ్యాయి. వాటి డీటెయిల్స్ త్వరలో చెబుతా. సైకో కిల్లర్ క్యారెక్టర్ లో కనిపించాలనేది నా కోరిక. నేను సైకో కిల్లర్ ఏంటి అనుకుంటారు. కానీ మనం ఆ జానర్ మూవీస్ చూస్తే ఎవరూ ఊహించని పాత్రలే క్రైమ్స్ చేస్తుంటాయి. అలాంటి అవకాశం వస్తే నటిస్తా.

# 'ఎస్ఎస్ఎంబీ29' పై ప్రియాంక చోప్రా కామెంట్!



కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా ముస్తాబవుతున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రియాంక చోప్రా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో ఆమెకు సంబంధించిన ప్రతి ఇంటర్వ్యూ వైరల్‌గా మారుతోంది. తాజాగా ప్రియాంక ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన మాటలను మహేశ్ అభిమానులు షేర్ చేస్తున్నారు. తాను ప్రస్తుతం ఓ ఇండియన్ సినిమాలో నటిస్తున్నట్లు చెప్పిన ఆమె ఆ ప్రాజెక్ట్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.వివాహం అనంతరం హాలీవుడ్‌లో స్థిరపడిన ప్రియాంక తాను ఇక్కడి సినిమాలను మిస్ అవుతున్నట్లు చెప్పారు. ''నేను ఇండియాను, హిందీ సినిమాలను మిస్ అవుతున్నాను. ఈ సంవత్సరం ఓ భారతీయ సినిమాలో నటిస్తున్నాను. ఆ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇండియన్ ఆడియన్స్ నాపై చూపే ప్రేమ ఎంతో విలువైనది. అది ఎల్లప్పుడూ ఇలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాను'' అని చెప్పారు. దీంతో ప్రియాంక 'ఎస్ఎస్ఎంబీ29' గురించి మాట్లాడిందంటూ అభిమానులు ఆనందిస్తున్నారు.%బావీదీ%29 విషయానికొస్తే.. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉంది. అటవీ నేపథ్యంలో సాగే కథతో ప్రపంచాన్ని చుట్టేసే సాహస ప్రయాణంగా ఈ సినిమాని సిద్ధం చేస్తున్నారు రాజమౌళి. ఇందులో మహేశ్ మునుపెన్నడూ చేయని ఓ విభిన్నమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.